thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 105 | జగిత్యాల మంగళవారం 14 జూలై, 20266 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

భారత మహిళలదే లార్డ్స్




11



## కాంగ్రెస్ తెచ్చిన కరువే

- కావాలనే నీళ్లు వదిలేస్తున్న ప్రభుత్వం
- కక్షతో రైతులను ఆగం చేస్తున్నారు
- సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఫైర్

2

## బుల్లెట్ రైళ్ల హబ్‌గా తెలంగాణ

- రాష్ట్రానికి మంజూరైన 3 బుల్లెట్ రైళ్లు
- వేగంగా రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం
- కేంద్ర మంత్రి వైష్ణవ్ ప్రకటన

.. వివరాలు 3లో





## సీఎంపీ ప్యాడ్ హబ్!

- దేశంలోనే తొలి టెక్నాలజీ హబ్
- హైదరాబాద్ టీవర్క్స్‌లో అట్టహాసంగా ప్రారంభం
- జపాన్ కంపెనీతో సాంకేతిక ఒప్పందం
- సీఎంపీ ప్యాడ్ల తయారీకి శ్రీకారం
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

3

## 9వ తరగతి బాలికపై లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి దారుణం!
- నిందితుడు సమీప బంధువేనని ఆరోపణలు..
- కరీంనగర్ ఆస్పత్రిలో విషమంగా పరిస్థితి



2



## విమాన సర్వీసులు పెంచండి

- ఏ380 విమానాలు ఇక్కడినుంచి నడపాలి
- వరంగల్ ఆదిలాబాద్‌ల్లో సేవలు విస్తరించాలి
- ఎంఆర్వో కార్యకలాపాలకు పూర్తి సహకారం
- క్రీడాకారులకు సైతం స్పాన్సర్ చేయాలి
- ఎమిరేట్స్ సంస్థకు సీఎం విజ్ఞప్తి

..వివరాలు 2లో



## కేంద్రం నుంచి అనుమతి తెస్తే ఎత్తిపోస్తాం

### ఎన్డీఎస్ఏ అభ్యంతరం లేకుంటే ఓకే

- లేదంటే ప్రాజెక్టుకు తీవ్ర ముప్పు
- తప్పులు చేసింది గత ప్రభుత్వమే
- ఇప్పుడు మాపై నెపాలు వేస్తున్నారు
- గేట్లు మూస్తే ముంపు తప్పదు
- ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈటెల వ్యాఖ్యలు
- బిఆర్ఎస్ నేతల సూచనలతోనే మాట మార్చిన ఈటెల
- ఈటెల, బిఆర్ఎస్ నేతలకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తా
- సీఎం రేవంత్ రెడ్డి

2

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టు నాశనమైందని ఆయన మండిపడ్డారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ జలశక్తి మంత్రితో మాట్లాడి ఎన్డీఎస్ఏ నుంచి అనుమతి తీసుకువస్తే.. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడానికి తమ ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. గేట్లు మూయకుండా నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని, అలాగని గేట్లు మూస్తే ప్రాజెక్టు కొట్టుకుపోతుందన్న ఎన్డీఎస్ఏ హెచ్చరికల మేరకే తాము నడుచుకుంటున్నామని సీఎం వివరించారు.ఆశనివారం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ విపక్షాల తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

- హైదరాబాద్

## షాబాద్‌లో ఆరు హత్యలు

### బెయిల్‌పై వచ్చి పోక్సో నిందితుడు ఘాతుకం



బాలిక సహా ఆరుగురి బలి

భార్య పిల్లలను చంపిన సైకో

పరారీలో హంతకుడు

- పోలీసుల వైఫల్యమే కారణమన్న స్థానికులు
- తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన ఘటన
- పరామర్శకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలు
- ఎక్కడికక్కడ అరెస్ట్ చేసిన పోలీసులు
- 7 బృందాలతో గాలింపు చర్యలు

రంగారెడ్డి జిల్లా షాబాద్ పరిధిలో పోక్సో కేసు నిందితుడు కిరాతకంగా ఆరుగురిని దారుణంగా హత్య చేసి మారణహోమం సృష్టించాడు. జైలు నుంచి బెయిల్ మీద వచ్చిన సైకో కిల్లర్.. తనపై కేసు పెట్టిన మైనర్ బాలికతో పాటు ఆమె తల్లి, నాయనమ్మను కడతేర్చాడు. అనంతరం సొంత భార్య, ఇద్దరు కన్నపిల్లల గొంతులు కోసి అత్యంత కిరాతకంగా చంపేశాడు. ఒకే రాత్రి ఈ ఆరు హత్యల ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఇంతటి ఘాతుకం జరిగిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 3లో..

## షాబాద్ ఎస్ఐ రమేష్ సస్పెన్షన్

హంతకుడిపై రివార్డు ప్రకటన!.. పది బృందాలతో ముమ్మర గాలింపు

పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన..ఎమ్మెల్యేను అడ్డుకున్న స్థానిక ప్రజలు

3

## నన్ను చంపాలనుకుంటే మటాష్



- వేయి క్షిపణులు ఇరాన్‌పై ఏకకాలంలో దాడి
- ఊహించని విధంగా ఇరాన్‌ను అంతం చేస్తా
- సైన్యానికి ఆదేశాలు ఇచ్చి పెట్టాను
- సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో ట్రంప్ హెచ్చరికలు

4

## ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా ప్రజలతోనే కనెక్ట్ అవుతారు

- మధ్యలో ఇతరుల జోక్యం కోరుకోరు
- మీడియాను దూరంగా పెట్టడంపై జర్నలిస్ట్ ప్రశ్న
- విదేశాంగ అధికారి రుద్రేంద్ర టాండన్ జవాబు



2

## బంధం మరింత బలోపేతం

- ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుంది
- ప్రవాస భారతీయులు కృషి ఇందుకు ప్రధాన కారణం
- న్యూజిలాండ్ పర్యటనలో మోడీ



4

# రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా!

- రాష్ట్ర ఎంపీలతో సీఎం రేవంత్ సమావేశం
- కేంద్రం నుంచి నిధుల సాధనపై దిశానిర్దేశం
- ప్రజాభవన్‌లో అధికారుల పవర్ పాయింట్ ప్రెజెంటేషన్
- పార్టీలకు అతీతంగా పని చేయాలని సూచన
- సమావేశంలో పాల్గొన్న పలువురు మంత్రులు, ఎంపీలు




**హైదరాబాద్, జూలై 13:** రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో తెలంగాణకు చెందిన వివిధ పార్టీల ఎంపీలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై అధికారులతో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇప్పించారు. ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పనకు కేంద్రం నుంచి అనుమతులు సాధించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. దేశ జనాభాలో 10 శాతం జనాభా ఆరు మహా నగరాల్లో ఉందని, ఇందులో హైదరాబాద్ నగరం 25 శాతం జీడీపీ కలిగి ఉందని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు కోసం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసి మంజూరుకు విజ్ఞప్తి చేయాలని ఎంపీలకు సూచించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1 స్వాధీనం, ఫేజ్ 2 విస్తరణకు కన్సల్టెంట్‌గా ఎస్‌బీఐ క్యాప్స్‌ను నియమించేందుకు కేంద్రం అంగీకరించిందని, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో 95 శాతం భూ సేకరణ పూర్తయిందని, ఆ పనుల ప్రారంభానికి, దక్షిణ భాగం భూ సేకరణకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలపాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవనం పనులకు కేంద్ర అప్రూవల్ లెటర్ ఇవ్వాల్సి ఉందన్నారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు 15.09 టీఎంసీల నీరు రావలసి ఉన్నా పూడికతో 5 టీఎంసీలకు మించి రావడం లేదన్నారు. డ్యామ్‌తో పాటు కాలువల్లో పూడిక తొలగింపునకు ఏపీ, కర్ణాటక సహకరించేలా ఒప్పించాలని కేంద్ర మంత్రిని కోరామని సీఎం తెలిపారు. నదుల అనుసంధానంలో ఛత్తీస్‌గఢ్‌కు గోదావరిలో 300 టీఎంసీల వాటా ఉందన్నారు. భవిష్యత్‌లో వారు 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీలు మిగులు ఉంటాయని, అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ ఎన్‌ఓసీలు ఇస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని చెప్పారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150 నుంచి 151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రితో భేటీ అవుదామని ఎంపీలకు సూచించారు. బుల్లెట్ రైళ్లకు సంబంధించి ఎలైన్‌మెంట్లు కొలిక్కివచ్చాయని సీఎం వివరించారు. ఆదిలాబాద్, వరంగల్ డిఫెన్స్ ఎయిర్‌పోర్టులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేశామని తెలిపారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నా ఢిల్లీలోని కో ఆర్డినేషన్ అధికారి, ఐఏఎస్ అద్వైత్ కుమార్ సింగ్ నుంచి తీసుకోవచ్చని ఎంపీలకు సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, పలువురు ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కుల వివక్షను దూరం చేస్తాం

- 25 ఎకరాల్లో రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం
- ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో సీఎం భేటీ
- విద్యా సంస్కరణలు వివరించిన రేవంత్ రెడ్డి
- కేంద్రం సహకారం అందించాలని సీఎం విజ్ఞప్తి



**హైదరాబాద్, జూలై 13:** రేవంత్‌తో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానా భేటీ అయ్యారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో జరిగిన ఈ సమావేశంలో సీఎం విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను బృందానికి వివరించారు. ప్రధానంగా విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎస్సీల అభివృద్ధికి కేంద్రం కూడా సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు మెరుగైన విద్యను అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. బ్రేక్‌ఫాస్ట్, లంచ్ బడిలోనే అందిస్తూ, విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ముందుగా కోర్ అర్బన్ ప్రాంతాల్లో వీటిని ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నామని సీఎం వివరించారు. రాజకీయాలతో పాటు ఇతర రంగాల్లో వారికి అత్యంత కీలక స్థానాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ కూడా పూర్తి చేసి రాష్ట్రంలో పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి అడ్లూరి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గోదావరి నీటిని పూర్తిగా వాడుకుంటాం

- దేవాదుల ద్వారా 7 మోటార్లతో పంపింగ్
- బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్మాణాలు నాసిరకం
- సమ్మక్క బ్యారేజీ వద్ద నీటి నిల్వ
- మేడిగడ్డలో గేట్లు మూస్తే ప్రమాదం
- నిపుణుల సూచనలు పాటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- దేవాదుల ప్రాజెక్టుకే మా తొలి ప్రాధాన్యత
- బ్యారేజీ పనులను పరిశీలించిన మంత్రులు భట్టి, ఉత్తమ్, పొంగులేటి



**ములుగు, జూలై 13:** గోదావరి జలాలను సాధ్యమైనంత మేరకు వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ ప్రాజెక్టును మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజీకి తీవ్ర ప్రమాదం ఉందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ హెచ్చరించిందని, అందుకే నిపుణుల సూచనలను కచ్చితంగా పాటిస్తున్నామని మంత్రులు స్పష్టం చేశారు. హెలికాప్టర్‌లో ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మంత్రులకు స్థానిక అధికారులు ఘన స్వాగతం పలికారు. సమ్మక్క బ్యారేజీ, దేవాదుల ప్రాజెక్టు పనులను మంత్రులు నిశితంగా పరిశీలించారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిపై వారు కీలక వ్యాఖ్యలు చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్ ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించే వారు వాస్తవాలు తెలుసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. పారే నీటినే ఎత్తుకునే అవకాశం ఉంటే కేసీఆర్ ప్రభుత్వం 3 బ్యారేజీలు ఎందుకు కట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 22 రిజర్వాయర్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. గతంలో నిర్మించిన డ్యామ్‌లు ఎంతో భద్రంగా ఉంటే, బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన బ్యారేజీలు మాత్రం నాణ్యత సమస్యలతో నిలిచిపోయాయని ఆయన ఆరోపించారు. సమ్మక్క బ్యారేజీలో నీటిని నిల్వ చేస్తే పంపింగ్ ఎంతో సులభం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకే తమ ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని నిపుణుల కమిటీ ఇప్పటికే నివేదించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డిజైన్ లోపాలు, నాణ్యతలేమి కారణంగానే ప్రస్తుతం ఈ దుస్థితి వచ్చిందని ఆయన ఆరోపించారు. మేడిగడ్డపై ఐఐటీ బాంబే నిపుణులతో పాటు సైన్యం సహకారంతో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. దేవాదుల ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేస్తున్నామని, ప్రస్తుతం 7 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం నీటిని వాడకుండానే గత ఏడాది 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించామని గుర్తు చేశారు.



# సుప్రీం సాక్షిగా వైఫల్యం!

**కావాలనే లోపాలతో పిటిషన్ .. బనకచర్ల విషయంలో నాటకాలు**

**రాజకీయ గురువు కోసమే డ్రామాలు.. రేవంత్‌పై హరీష్ రావు ఫైర్**

**సంగారెడ్డి, జూలై 13:** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా మరోసారి బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కావాలనే లోపాలతో కూడిన పిటిషన్‌ను వేయడం వల్లే అది నిలవదని ఉన్నత న్యాయమూర్తులు మొట్టికాయలు వేశారని ఆయన గుర్తు చేశారు. బానకచర్ల విషయంలో తన రాజకీయ గురువు చంద్రబాబు కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కపట నాటకాలు, డ్రామాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. బానకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ నెత్తీనోరు బాదుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారని చెప్పడానికి ఇంతకంటే ఇంకేం ఆధారాలు కావాలని ఆయన ప్రశ్నించారు. "నువ్వు కొట్టినట్లు చేయి.. నేను ఏడ్చినట్లు చేస్తా" అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారని ఆయన ఫైర్ అయ్యారు. బానకచర్ల సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్.. ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని హరీష్ రావు ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని ఆయన నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువని ఎద్దేవా చేశారు. బానకచర్లపై గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన రిట్ పిటిషన్ డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చూస్తోందని ఆయన ప్రశ్నించారు. ఎన్‌ఓసీ పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్మేసుకుంటున్నారని, దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి తక్షణం చర్చ జరపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. దొంగచాటుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బానకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులను వాడుకోవడం కూడా కాంగ్రెస్ నేతలకు చేతకావడం లేదని మండిపడ్డారు.

# జాడలేని వర్షాలు.. ముఖం చాటేసిన మబ్బులు

**మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**

**హైదరాబాద్, జూలై13:** తెలంగాణలో జులై నెలలోనూ ఎండలు తీవ్రత మళ్లీ మెల్లగా పెరుగుతోంది. వర్షాలు ముఖం చాటేయంతో ఎండలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఈ కాలంలో వర్షాలు కురవాల్సి ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. జులై రెండో వారంలోనూ సాధారణం కంటే సుమారు 3.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్య సమస్యలున్న వారు అవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. అలాగే తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# కేసీఆర్ దిగజారుడు రాజకీయాలు

**ఎన్టీఆర్ ప్రాపకం కోసమే కొడుక్కు తారకరామారావు పేరు**

**భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపాటు**



**హైదరాబాద్, జూలై 13:** కేసీఆర్ రాజకీయ జీవితమంతా పాప పంకిలమేనని, అవసరానికి తగ్గట్లుగా ఊసరవెల్లి తీరులో నడిచిన ఘనుడని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టికెట్ కోసం కొడుకు పేరు మార్చిన ఘనత కేసీఆర్ ది అంటూ వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌ను కాకా పట్టేందుకు కొడుకు పేరును తారకా రామారావు అని పెట్టుకున్నాడని అన్నారు. మంత్రి పదవి రాలేదనే కేసీఆర్ టీడీపీ నుంచి బయటకు వచ్చారన్నారు. చంద్రబాబు కూడా మంత్రి పదవి ఇవ్వకుండా పక్కన పెట్టారని అన్నారుపార్టీ పెట్టి ఎలక్షన్లు, కలెక్షన్లు చేసిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రక్తదాహం, ధనదాహం, అధికార దాహం ఉందని విమర్శించారు. అందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఇంటికి పరిమితం చేశారన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ఎంపీ తెలిపారు. తెచ్చింది కాంగ్రెస్ నేతలన్నారు. విద్యార్థులను రెచ్చగొట్టి బలిదానాలకు బీఆర్ఎస్ కారణమైందని అంటూ ఆరోపించారు. పిట్ట కథలు చెప్పి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. కమిషన్లు దండుకోవడం తప్ప ఎకరానికి కూడా కేసీఆర్ నీళ్లు ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. 'పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది' అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సెటైర్ విసిరారు. 2009లో కేటీఆర్ తెలంగాణ ఉద్యమంలోకి వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులను కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలూ ఒక్కటే అని.. ఈటల రాజేందర్‌ను ఎంపీగా గెలిపించింది బీఆర్ఎస్ అంటూ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు గుప్పించారు. అందుకే బిజెపి ఎంపి ఇప్పుడు మళ్లీ బిఆర్ఎస్ గొంతుతో మాట్లాడుతున్నారని అన్నారు. కాళేశ్వరం పేరుతో నిధులు దండుకున్న వీరు మళ్లీ దానిగురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు.



# తెలంగాణకు సుప్రీంలో చుక్కెదురు!

**ఏపీకి నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు**

**బనకచర్ల అనుసంధానంపై పిటిషన్ దాఖలు**

**అభ్యర్థనను తోసిపుచ్చిన జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం**

**తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని స్పష్టీకరణ**

**లోపాలు సవరిస్తేనే విచారణ చేపడతామని తేల్చిచెప్పిన న్యాయస్థానం**

**న్యూఢిల్లీ, జూలై13:** బానకచర్ల అనుసంధానం, గోదావరి నీటి వినియోగం, పోలవరం అంశాలపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలన్న తెలంగాణ సర్కార్ విజ్ఞప్తిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం ఏమాత్రం కుదరదని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. బానకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడంతో పాటు ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోర్టును కోరింది. అయితే జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయిందంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇలాంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా ఛాంబర్ జడ్జి ముందుకు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ప్రధాన పిటిషన్‌లో పలు లోపాలు ఉన్నాయని, వాటిని సవరించే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. ఈ కేసులో 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు.పిటిషన్‌లో ఉన్న లోపాలను ముందుగా సరిదిద్దాలని, ఆ తర్వాతే విచారణలో మిగతా అంశాలను నిశితంగా పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. అప్పటి వరకు ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదనను సుప్రీంకోర్టు ఏమాత్రం పట్టించుకోలేదు. పిటిషన్‌పై ఎలాంటి విచారణ జరపకుండా నోటీసులు ఎలా ఇస్తామని ప్రశ్నించింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని కోర్టు స్పష్టం చేసింది.

# సర్పంచ్ కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

**రాజన్న సిరిసిల్ల, జూలై13:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి సర్పంచ్ మాశెట్టి లచ్చయ్య కుటుంబాన్ని పరామర్శించారు. లచ్చయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లచ్చయ్య అకాల మరణం బాధాకరమని కేటీఆర్ అన్నారు. ఆయన మృతి తీరని లోటు అని పేర్కొన్నారు. లచ్చయ్య కుటుంబసభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కాగా, కేటీఆర్ వెంట న్యాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు , పార్టీ, గ్రామ నేతలు ఉన్నారు

# ఉరేసుకుని మహిళా సర్పంచ్ ఆత్మహత్య

**నిర్మల్, జూలై13:** నిర్మల్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. తానూరు మండలం బోరిగావ్ గ్రామ సర్పంచ్ పల్లె జ్యోతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సర్పంచ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులా? కుటుంబ కలహాలా? మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

# సిఎం రేవంత్ దిగజారుడు భాష

**బూతుపురాణాలు సరికాదు: ఎంపి ఈటెల రాజేందర్**

**హైదరాబాద్, జులై 13:** రాష్ట్ర చరిత్రలో అత్యంత దిగజారుడు భాష మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఒక్కడేనని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గత కొద్ది రోజులుగా ప్రతిపక్షాలను అందునా బీఆర్ఎస్ లక్ష్యంగా బూతు పురాణం అందుకుంటున్న సీఎం తీరుపై ఆయన స్పందించారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద నీళ్లు 94 మీటర్లు లేకున్నా కేవలం రూ.2 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించి నీళ్లు లిఫ్ట్ చేయొచ్చు. అది వదిలేసి సలహాలు ఇస్తున్న ఇంజినీర్లను తిట్టడం, బీఆర్ఎస్ నాయకుల రక్తం చిందిస్తా అనడం మూర్ఖత్వమన్నారు. రేవంత్ రెడ్డి నాకు ఎన్‌డీఎస్ఏ చెప్తేనే ప్రాజెక్టుల్లో నీళ్లు నింపుతా అని అజ్ఞానంతో మాట్లాడుతున్నాడు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పిల్లర్లు ఎక్కడా కుంగిపోలేదని, ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ ప్రకారం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు గ్రౌటింగ్ కూడా చేశారన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నందున అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీళ్ళు నింపుతామని రేవంత్ రెడ్డి ఎన్‌డీఎస్ఏ దగ్గరికి వెళ్ళి అడిగాడా? అని నిలదీశారు. ఇప్పటికైనా భేషజాలకు పోకుండా కాళేశ్వరం జలాలతో ప్రాజెక్టులను నింపి రైతులను ఆదుకోవాలని హితవు పలికారు.

# నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా పెంజర్ల పొలాల్లో మృతదేహం
- స్థానికుల సమాచారంతో రాజ్‌కుమార్ గుర్తింపు
- మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ లభ్యం
- శవం పక్కనే ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- హత్యకు ముందు వీడియో కాల్ రికార్డు చేసిన హంతకుడు



**రంగారెడ్డి, జూలై13:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్‌కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్‌కుమార్‌గా నిర్ధారించారు. మృతదేహం పక్కన పాయి-ౕజన్ బాటిల్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఓ బాలికను వేధించిన వ్యవహారంలో తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు. తొలుత బాలిక తల్లి, నానమ్మలను కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్-బెంగళూరు హైవేల్లోని హోటళ్లు, లాడ్జీలు, దాబాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబసభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతికి ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. మృతదేహం పక్కన ఉన్న అతడి మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. రాజ్‌కుమార్‌కు బెట్టింగ్ అలవాటు ఉందని.. దీనికోసం 16 సిమ్‌లు వినియోగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల బాధతో జీవితంపై విరక్తి కలిగిందని.. ఓ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయానని సెల్ఫీ వీడియోలో రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. 2.26 సెకన్ల నిడివి గల ఈ వీడియోను మీడియా ప్రతినిధులకు సీపీ చూపించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీడియో రికార్డు చేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో బాలిక సహా ఆరుగురిని అత్యంత దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ కేసు హంతకుడు రాజ్‌కుమార్ మృతదేహం అతని మేనమామ ఊరు కొత్తూరు మండలం పంజర్లలో లభ్యమైనట్లు చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు సమీపంలోని ఓ వెంచర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ మృతదేహం రాజ్‌కుమార్‌దేనని డీసీపీ ధ్రువీకరించారు. రాజ్‌కుమార్ పాయిజన్ సేవించి ఆత్మహత్య చేసుకున్నాడని డీసీపీ పేర్కొన్నారు. ఘటనాస్థలిలో పాయిజన్ బాటిల్ లభ్యమైందని తెలిపారు. ఆ ఆధారాలను సేకరించిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. కాగా, షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా, ఈరోజు అతడి మృతదేహం లభ్యమైంది.

**వెలుగులోకి కీలక విషయాలు**

సంచలనం సృష్టించిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్‌కు సంబంధించిన పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జూన్ 12న పోక్సో కేసులో కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో అతడు కోర్టులో చేసిన వాదనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. బెయిల్ విచారణ సందర్భంగా.. తనపై నమోదైన పోక్సో కేసు తప్పుడు కేసు అని రాజ్‌కుమార్ కోర్టుకు తెలిపినట్లు సమాచారం. బాధిత బాలిక తండ్రి తన వద్ద అప్పు చేశాడని, ఆ డబ్బులు తిరిగి అడిగినందుకే తనపై కేసు పెట్టారని వాదించాడు. ఫిర్యాదు చేసిన రోజు తాను అక్కడే లేనని, ఆ సమయంలో భార్యతో కలిసి ఆస్పత్రికి వెళ్లినట్లు కోర్టులో తెలిపాడు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం.. మైనర్ బాలికకు సంబంధించిన కేసు నమోదైన తర్వాత రాజ్‌కుమార్ కుటుంబంలో విభేదాలు మరింత పెరిగాయి. ఈ వ్యవహారం తర్వాత అతడి భార్య సరిత విడాకులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఇదే విషయంపై రాజ్‌కుమార్ తీవ్ర ఆగ్రహానికి గురై, పలుమార్లు సరితను చంపేస్తానని బెదిరించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. పోలీసుల దర్యాప్తు ప్రకారం.. హత్యలకు ముందు రాజ్‌కుమార్ సాధారణంగానే వ్యవహరించినట్లు గుర్తించారు. ఘటనకు కొన్ని గంటల ముందు తన కుమారుడితో కలిసి బయటకు వెళ్లి ఆడించడంతో పాటు హెయిర్ కటింగ్ కూడా చేయించినట్లు సమాచారం. అదే రోజు ఉత్సాహంగా ఇంటికి వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులపై దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

# బాలికను నమ్మి అప్పులపాలయ్యా

- ఆత్మహత్యకు ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో
- నా పిల్లలకు భూమి లేకుండా చేశానని కన్నీటి పర్యంతం
- జీవితం మీద విరక్తి చెందానని వెల్లడించిన కిరాతకుడు
- వివరాలు వెల్లడించిన సైబరాబాద్ కమిషనర్ జోషి



**షాబాద్, జూలై13:** షాబాద్‌లో వరుసగా 6 గురిని హత్య చేసిన రాజ్‌కుమార్.. ఆ తర్వాత ఆత్మహత్య చేసుకోవడానికి ఒకరోజు ముందే సెల్ఫీ వీడియో రికార్డ్ చేసినట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. ఆ బాలికను నమ్మి పూర్తిగా అప్పులపాలయ్యానని, నా పిల్లలకు కనీసం సెంటు భూమి కూడా లేకుండా చేశానని ఆ వీడియోలో రాజ్‌కుమార్ కన్నీటిపర్యంతమయ్యాడు. ఆమె వల్ల నా జీవితం నాశనమైందని, తనను జైలుకు పంపాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ వీడియో రికార్డ్ చేశాడు. రాజ్‌కుమార్ మృతదేహం దొరికిన చోటే లభ్యమైన ఫోన్‌లో ఈ వీడియోను పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైన రాజ్‌కుమార్ ఏకంగా 2 కోట్లకు పైగా అప్పులు చేశాడు. ఈ అప్పుల కారణంగా అతడి మానసిక పరిస్థితి స్థిమితంగా లేదని సీపీ తరుణ్ జోషి తెలిపారు. అతడు ఏకంగా 16 సిమ్ కార్డులు వాడినట్లు గుర్తించామన్నారు. కాలేజీకి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ఆ బాలికను రాజ్‌కుమార్ తీవ్రంగా వేధించేవాడని, అతడిపై గతంలోనే పోక్సో కేసు కూడా నమోదైందని ఆయన గుర్తు చేశారు. ఈ కేసులో రాజ్‌కుమార్ ముందస్తు బెయిల్ కూడా తెచ్చుకున్నాడని వెల్లడించారు. జులై 10 నే ఈ సెల్ఫీ వీడియోను అతడు రికార్డ్ చేసినట్లు గుర్తించామన్నారు. రాజ్‌కుమార్ 2 వేలకు ఓ కారును అద్దెకు తీసుకుని ఒకే రోజు 6 హత్యలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి 11 నుంచి 12 గంటల మధ్యలో ఈ హత్యలు జరిగాయని సీపీ చెప్పారు. ముందుగా షాబాద్‌లో బాలిక నానమ్మను చంపి, ఆ తర్వాత ఆ బాలికను తీసుకుని దైవాలగూడ వెళ్లాడని చెప్పారు. అక్కడే బాలికతో పాటు తన భార్యను, ఇద్దరు పిల్లలను కిరాతకంగా చంపేశాడని వివరించారు. హత్యల అనంతరం రాత్రి 11:37 గంటలకు తన తండ్రికి ఫోన్ చేసిన రాజ్‌కుమార్.. 6 గురిని చంపేశానని, తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పినట్లు సీపీ తరుణ్ జోషి వెల్లడించారు. ఆ తర్వాత రాత్రి ఒంటి గంటకు హంతకుడి తండ్రి పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. కాల్ డేటా ఆధారంగా హంతకుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయని చెప్పారు. క్లూస్ టీమ్ సభ్యులు అతడి మృతదేహం లభ్యమైన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారని, అయితే రాజ్‌కుమార్ ఏ సమయంలో చనిపోయాడనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని సీపీ తెలిపారు.

# సింగరేణిని దోచుకున్న పార్టీలు

- ఓటు బ్యాంకుగా వాడుకున్న కేసీఆర్
- మన్మోహన్ పాలనలో బొగ్గు కుంభకోణం
- సింగరేణికి మోదీ సర్కార్ అండ
- సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి



**హైదరాబాద్, జూలై13:** సింగరేణి సంస్థను గతంలో కాంగ్రెస్, పదేళ్ల పాటు బీఆర్ఎస్ పార్టీలు తీవ్రంగా దోచుకున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వేలం లేకుండానే సింగరేణికి తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్‌ను కేటాయించిందని ఆయన స్పష్టం చేశారు. కొత్తగూడెంలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సింగరేణి భరోసా యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల తీరును తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. గతంలో అధికారంలో ఉన్న మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో దేశంలోనే అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో కేటాయించిన బొగ్గు గనులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, ఆ తర్వాతే వేలం ప్రక్రియ పారదర్శకంగా జరగాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించిందని ఆయన గుర్తు చేశారు. అయితే సింగరేణికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ వేలం లేకుండానే తాడిచర్ల 2 బ్లాక్‌ను కేటాయించారని తెలిపారు. ఇందులో గ్రేడ్ 8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, రాబోయే 40 నుంచి 50 ఏళ్ల వరకు సింగరేణి అవసరాలు తీరుతాయని ఆయన వెల్లడించారు. గత పదేళ్ల పాటు సింగరేణిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అహంకారపూరిత నిర్ణయాలతోనే సంస్థ పరిస్థితి పూర్తిగా దిగజారిందని ఆరోపించారు. సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గు, విద్యుత్ బకాయిలు చెల్లించకుండా సంస్థను సుమారు 24 వేల కోట్ల అప్పుల్లోకి నెట్టేశారని మండిపడ్డారు. రాష్ట్రానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ సంస్థ అభివృద్ధి కోసం ఈ రెండు పార్టీలు ఎన్నడూ కేంద్రాన్ని సంప్రదించలేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే సింగరేణిని వాడుకున్నాయని దుయ్యబట్టారు. నైనీ బొగ్గు బ్లాక్ వ్యవహారంలో ఒడిశా రాష్ట్రంలో కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. సింగరేణికి సంబంధించిన అంశాల్లో కేంద్రం ఎప్పుడూ తలదూర్చదని స్పష్టం చేశారు. సంస్థలో బొగ్గు మాయమైందని కేటీఆర్, హరీష్ రావు లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మెస్సీతో ఫుట్‌బాల్ ఆడటానికి సింగరేణి డబ్బులు ఖర్చు చేస్తారా అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సింగరేణి సంస్థను అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేయడం మానుకోవాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

చురకలు

మంగళవారం 14 జూలై 2026

# గ్రామాల అభివృద్ధి పట్టని పాలకులు!



పల్లె కన్నీరు పెడుతోంది. మంచినీటి కోసం కన్నీరు పెడుతోంది. సాగునీటి కోసం రైతన్న కన్నీరు పెడుతున్నాడు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరించామన్న పెద్దమనుషులు గ్రామాలకు వస్తే.. చెరువులు ఎలా ఉన్నయో కనిపిస్తాయి. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం అంతా బోగస్. ఎక్కడా చెరువుల పునరుద్ధరణ జరగలేదు. జరిగితే ఇవాళ చెరువుల్లో నీటి చుక్కకూడా లేకుండా పోదు. వర్షాలు వెనక్కి పోవడంతో గ్రామాల్లో మంచినీటి సమస్యల తరుముకు వస్తోంది. పట్టణాల్లో ఇప్పుడిప్పుడే మళ్లీ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల భూగకభ జలాలు వట్టి పోయాయి. తాత్కాలిక చర్యలతో ప్రభుత్వాలు ఏళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలో ఏళ్లుగా గ్రామాలు కునారిల్లుతున్నాయి. కనీస వసతులు లేవు.

గ్రామాల అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. అమరావతి పేరుతో ఎపిలో గ్రామాలను పట్టించు కోవడం లేదు. బలవంతంగా రైతుల నుంచి భూములు లాక్కుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పంటలు వేసుకున్న పొలాలను జెసిబిలతో దున్నుతూ రైతులను వీధుల్లో పడేస్తున్నారు. వారికి గౌరవప్రదమైన పరిహారం కూడా చెల్లించడం లేదు. చంద్రబాబు నిరంకుశ విధానాలకు ఇది పరాకాష్టగా నిలుస్తోంది. తెలంగాణలో ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుద్ధరణ వంటి వాటికి ఇస్తున్న ప్రాధాన్యం గ్రామాలకు దక్కడం లేదు. దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ భూతంలా వెన్నాడుతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. మొక్కలు నాటడం లేదు. కోతులను తరమడం లేదు. భూగర్భ జలాలను పెంచే ప్రయత్నాలు సాగడం లేదు. ఈ సమస్యలన్నీ పరిష్కరించలేని వేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఇవన్నీ సాధ్యం. అలాగే ప్రజలను బాధ్యులుగా కూడా చేయాలి. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి.

సర్పంచ్‌లను అందుకు బాధ్యులను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను పురోగించేలా చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపతేం చేస్తూ పోవాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. ఎందుకంటే రోడ్డురవాణాను విస్తరిస్తే గ్రామాలు వాటంతట అవే పురోగమిస్తాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతంది. పదిశాతం దృష్టి గ్రామాలపై పెట్టినా అవి అల్లుకు పోతాయి. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యవతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పటు గ్రామాలు పురోగమిస్తాయి. చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీపడటం... తప్పు లేదు. అందుకు తగ్గట్లుగా గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయగలిగితేనే ఇది సాధ్యం అవుతుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయ రంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి.

గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని స్థానిక వనరులను ఉపయోగించుకుంటే అభివృద్ధికి దోహదపడగలదు.చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఓవైపు రాష్ట్రమంతటా ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. అప్పుడప్పుడు మబ్బులే తప్ప వానలు పడటం లేదు. ఒక్కోరోజు వాతావరణం ఎండాకాలాన్ని తలపి స్తున్నది. పంటలు సాగు చేసేందుకు రైతులు వెనుకాడుతున్న పరిస్థితి కనపడుతోంది. గతేడాది కంటే ప్రస్తుతం రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది. దేశంలో పంటల సాగుపై ఎల్ నినో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నది. ఎల్ నినో తీవ్ర రూపం దాల్చడంతో వానలు కరువయ్యాయి. మబ్బులే తప్ప చినుకు జాడలేదు. ఇప్పటివరకు రాష్ట్రంలో 21శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలుపడలేదు. జూలై సగం నెల గడుస్తున్నా వానలు ముఖం చాటేసాయి. ఈ నెలలోనూ వర్షాలు కురువకపోవచ్చనే అంచనాలను వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు వేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఒకవేళ ముందుగానే పంటలు వేస్తే తర్వాత వర్షాలు కురువకపోతే పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉంటుందని రైతులు భయపడుతున్నారు. దీంతో పంటలు సాగు చేసేందుకు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇదంతా కూడా గ్రామాల్లో వాననీటిని ఒడిసి పట్టకపోవడం వల్ల జరిగిన నష్టంగా గుర్తించాలి. ఇప్పటికైనా గ్రామాల్లో తాగు, సాగునీటి ప్రాజెక్టును పునరుద్ధరించడం ద్వారా అభివృద్ధికి అడుగులు వేయాలి.

# ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ఉల్లంఘనలు

**ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతున్న అమెరికా**

**తాజా దాడులపై మండిపడ్డ ఇరాన్**



**టెహ్రాన్, జూలై 13 :** పశ్చిమాసియాలో యుద్ధం ఆగినట్టే కనిపించినా.. ఇటీవల మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్, అమెరికా పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఐఆర్‌జీసీ దాడులు చేయడం తాజా ఉద్రిక్తతలకు మరింత ఆజ్యంపోసింది. అమెరికా జరిపిన తాజా సైనిక దాడులపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ దాడులను ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను స్పష్టంగా ఉల్లంఘించడమేనని అభివర్ణించిన ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ, వాషింగ్టన్ చర్యలు ప్రాంతీయ స్థిరత్వాన్ని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని దెబ్బతీస్తు న్నాయని ఆరోపించింది. ఇది ముమ్మాటికీ ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచడమేనని ఆరోపించింది. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ, అమెరికాకు సహకరించే దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా తమపై దాడులు చేయడానికి ఏ దేశమైనా తన భూభాగాన్ని లేదా సదుపాయాలను ఉపయోగించుకోవడానికి అనుమతిస్తే, ఆ దేశాలను కూడా తాము శత్రువులుగానే పరిగణిస్తామని ఇరాన్ స్పష్టం చేసింది. 'ఇరాన్‌పై సైనిక దాడులు చేయడానికి ఏ దేశ భూభాగం లేదా సదుపాయాలు ఉపయోగించినా, దానిని దురాక్రమణకు మూలంగా పరిగణిస్తాం. ఇరాన్ సాయుధ దళాల రక్షణాత్మక చర్యల్లో భాగంగా వాటిని చట్టబద్ధమైన లక్ష్యాలుగా చూస్తాం'. అని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఇటీవల మస్కట్‌లో జరిగిన చర్చల ఫలితాలపై అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ఇరాన్ పూర్తిగా తోసిపుచ్చింది. వాటిని 'పచ్చి అబద్ధం' గా తేల్చింది. మస్కట్ చర్చలు కేవలం హోర్ముజ్ జలసంధి నిర్వహణ, అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపైనే జరిగాయని, అమెరికా అధ్యక్షుడు చిత్రీకరిస్తున్నట్లుగా కాదని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా జరిపిన సైనిక చర్యలపై ఐక్యరాజ్యసమితి సెక్రటేరియట్ స్పందించిన తీరు సరిగ్గా లేదని ఇరాన్ విమర్శించింది. అంతర్జాతీయ చట్టాలను, ఐరాస చార్టర్‌ను ఉల్లంఘించిన అమెరికాను జవాబుదారీగా చేయాలని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్, భద్రతా మండలిని ఇరాన్ కోరింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే వాణిజ్య నౌకలు, పౌరులపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం ఇరాన్‌పై సరికొత్త సైనిక దాడులను ప్రారంభించింది. అంతకుముందు శనివారం కూడా అమెరికా దళాలు ల్యాండ్, సీ-బేస్డ్ ÷టైర్ ఎయిర్‌క్రాఫ్ట్, డ్రోన్లు, నౌకాదళ నౌకల ద్వారా దాదాపు 140 ఇరాన్ సైనిక లక్ష్యాలపై కచ్చితమైన దాడులు చేశాయి. ఇందులో ఇరాన్ క్షిపణి, డ్రోన్ సైట్లు, నౌకాదళ సామర్థ్యాలు, మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రాలు, తీర నిఘా ప్రాంతాలు ఉన్నాయి. అమెరికా దాడుల అనంతరం దక్షిణ ఇరాన్ నగరాలైన జాస్క్, బందర్ అబ్బాస్, సిరిక్‌లలో మూడు భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రెస్ టీవీ ధృవీకరించింది. మరోవైపు, ఇరాన్-అమెరికా మధ్య పెరుగుతున్న సైనిక ఘర్షణలపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతలు ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని ఆయన హెచ్చరించారు.

# ప్రతీకార దాడులకు ఇరాన్ ఎత్తుగడ

**ట్రంప్, నెతన్యాహులను మట్టుబెట్టే ప్లాన్**

**తాజాగా స్థానిక మీడియాలో రివెంజ్ లిస్ట్**



**టెహ్రాన్, జూలై 13 :** ఇరాన్‌పై అమెరికా తాజా దాడులతో మరోమారు పశ్చిమాసిలో శాంతి కరువయ్యింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని స్థానిక మీడియా.. 13 మంది విదేశీ నేతల పేర్లతో ఉన్న రివేంజ్ లిస్ట్‌ను ప్రచురించడం గమనార్హం. ఆ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సహా పలువురు ఐరోపా నేతల పేర్లు ఉన్నాయి. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో నాటి సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని.. దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రతీకార జాబితా బయటకు రావడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ వ్యాప్తంగా పదుల సంఖ్యలో లక్ష్యాలపై తాము దాడి చేశామని, వాటిలో క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, మందుగుండు సామగ్రి డంప్‌లు, కమ్యూనికేషన్ సాధనాలు, చిన్న బోట్ల వంటివి ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అనంతరం గల్ఫ్‌లోని పలు దేశాల్లో సైరన్లు వినిపించాయి. బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఒమన్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తాజాగా ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా డ్రోన్ ఫ్లీట్, రెండు క్షిపణి లాంచర్లు, క్షిపణులను నిల్వ చేసిన గిడ్డంగులను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. అగ్రరాజ్యం చేస్తోన్న దాడులతో పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేం దుకు ఇంతకాలంగా జరిగిన దౌత్యచర్చలు నిరుపయోగంగా మారాయని టెహ్రాన్ దుయ్యబట్టింది. అమెరికా వల్లే హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకాయానానికి అంతరాయం ఏర్పడిందని ఆరోపించింది.

# పేపర్ లీక్‌లపై రాహుల్ గాంధీ మండిపాటు

- విద్యా వ్యవస్థ దోపిడీ యంత్రాంగంగా మారిందని విమర్శ
- 'ఛాత్రోన్ కీ గూంజ్'లో విద్యార్థులు పాల్గొనాలని పిలుపు



**న్యూఢిల్లీ, జూలై 14:** దేశంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతిపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. భారత విద్యా వ్యవస్థ ప్రస్తుతం నిజాయతీ లేని దోపిడీ యంత్రాంగంగా మారిందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. భారత విద్యా వ్యవస్థ గురించి తాను చేస్తున్న వ్యాఖ్యలు తన వ్యక్తిగత అభిప్రాయాలు కావని, దేశవ్యాప్తంగా విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆవేదననే తాను ప్రతిబింబిస్తున్నానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేయాల్సిన వ్యవస్థ వారిని, వారి కుటుంబాలను అప్పులు, మానసిక ఒత్తిడి, నిరాశల వైపు నెడుతోందని విమర్శించారు. దేశంలో కొనసాగుతున్న అవినీతే ప్రశ్నపత్రాల లీక్ మాఫియాకు ప్రధాన కారణమని రాహుల్ ఆరోపించారు. పోటీ పరీక్షల కోసం సంవత్సరాల పాటు కష్టపడుతున్న లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ఈ మాఫియా ఒక్కసారిగా నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ఈ అంశంపై మౌనం వహిస్తున్నారని విమర్శించారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికే కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. అలాగే ఈ అంశాన్ని ప్రశ్నించాల్సిన మీడియా కూడా దీర్ఘకాలంగా మౌనంగా ఉందని వ్యాఖ్యానించారు.

**'ఛాత్రోన్ కీ గూంజ్'లో పాల్గొనాలని పిలుపు**

దేశ విద్యా రంగంలో సమూల మార్పులు అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జూలై 17న డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థుల సమస్యలను మరింత బలంగా వినిపిద్దామని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన నమోదు వివరాల లింక్‌ను కూడా తన 'ఎక్స్' పోస్టులో పంచుకున్నారు.

# తమిళనాడులో ఘోర ప్రమాదం

**ఎదురెదురుగా రెండు బస్సులు ఢీకొని ఐదుగురు దుర్మరణం**



**చెన్నై, జూలై 13 :** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు బస్సులు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారు జామున మదురై జిల్లాలోని కొట్టంపట్టి సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రైవేటు బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను దాటింది. అదే సమయంలో తిరుచిరాపల్లి వైపు వెళ్తున్న ప్రభుత్వ బస్సు ఎదురుగా రావడంతో దానిని ఢీకొట్టి పక్కనే ఉన్న ప్రయాణికుల షెడ్డులోకి దూసుకెళ్లింది. ప్రైవేటు బస్సు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రభుత్వ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులతో సహా.. బస్టాప్‌లో నిద్రిస్తున్న మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మరో 40 మంది గాయపడగా.. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రైవేటు బస్సు చెన్నై నుంచి మార్తాండం వెళ్తుండగా.. డ్రైవర్ నియంత్రణ కోల్పోవ డంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

# పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత ముఖ్యం

- అసోంలో 27మంది వ్యక్తుల పౌరసత్వంపై విచారణ
- వారిపై బలవంతపు చర్యలు తీసుకోరాదన్న సుప్రీం

**న్యూఢిల్లీ, జూలై 13 :** పౌరసత్వాన్ని నిర్ధారించే లేదా ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అస్సాం లోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు 'విదేశీయులు'గా ప్రకటించిన 27 మంది వ్యక్తుల పౌరసత్వ స్థితిపై సోమవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు కీలక తీర్పునిచ్చింది. 'పౌరసత్వం, విదేశీయుడి హోదా అనేవి అత్యున్నత రాజ్యాంగ, చట్టపరమైన ప్రాముఖ్యత కలిగిన అంశాలు' అని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. అక్రమంగా పౌరస త్వం పొందాలని చూసే వారిని నిరోధించడంలో ప్రభు త్వానికి స్పష్టమైన ప్రయోజనాలు, బాధ్యతలు ఉంటాయనే విషయాన్ని సుప్రీంకోర్టు అంగీకరించింది. 'చట్టబద్ధంగా అర్హత లేని వ్యక్తులు.. తప్పుడు పత్రాలు, తప్పుడు క్లెయి మ్‌ల ద్వారా భారతీయ పౌరసత్వాన్ని పొందకుండా చూ సేందుకు ప్రభుత్వానికి చట్టబద్ధమైన, బలమైన ఆసక్తి ఉంటుంది. అయితే, తుది విశ్లేషణలో ఆ ఆసక్తి లేదా ప్రయోజనం.. న్యాయబద్ధమైన పక్రియను అధిగమించలే వు'. అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి గతంలో గౌహతి హైకోర్టు, ఫారినర్స్ ట్రిబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ట్రిబ్యునళ్లలో ఈ కేసుపై మరోసారి విచారణ జరిగే వరకు ఆ 27 మంది వ్యక్తులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. అయితే, పిటిషనర్ల పౌరసత్వాన్ని నిర్ధారించడానికి తాము ఇంకా ఎటువంటి ఆధారాలను పూర్తిగా పరిశీలించలేదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టును ఆశ్రయించిన వారిలో సావిత్రి దేయ్, అజ్బహర్ అలీ, ఎండీ అక్బర్ అలీ, అబేదా ఖాతూన్, అనోవారా ఖాతూన్ అనే వ్యక్తులు ఉన్నారు. పాత ఓటర్ల జాబితాలో పేర్ల స్పెల్లింగ్స్ తప్పుగా పడటం, చిన్న చిన్న తేడాలు ఉండటం వంటి సాంకేతిక కారణాల వల్లే తమను విదేశీయులుగా ప్రకటించారని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాము భారతీయ పౌరులమేనని నిరూపించుకోవడానికి 1971 కంటే ముందు నాటి లెగసీ డేటా, ఓటర్ల జాబితాలు, భూమి రికార్డులను వారు కోర్టుకు సమర్పించారు. కాగా, గత జూన్ నెలలో కూడా ఇలాంటి ఒక కేసులోనే.. ఐదుగురు మహిళలను విదేశాలుగా బహిష్కరించకుండా సుప్రీంకోర్టులోని మరో బెంచ్ అడ్డుకుంది. అవసరమైన అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ, కేవలం పేర్ల స్పెల్లింగ్స్‌లో తేడాలు ఉన్నాయనే కారణంతో వారిని విదేశీయులుగా ప్రకటించారని అప్పట్లో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజా తీర్పుతో అస్సాంలోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు పౌరసత్వ క్లెయిమ్‌లలను పరిశీలిస్తున్న తీరు, వారి ప్రమాణాలపై దేశవ్యాప్తంగా చట్టపరమైన చర్చ మొదలైందని నిపుణులు భావిస్తున్నారు.



# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం విజయవంతం చేయండి

- **1–19 ఏళ్ల పిల్లలకు ఉచితంగా ఆల్బెండాజోల్ మాత్రలు – తల్లిదండ్రులు సహకరించాలని వైద్య శాఖ పిలుపు**

**హైదరాబాద్, జూలై 13 :**

పిల్లల్లో నులిపురుగుల సమస్యను నివారించి, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదల, పోషకాహార లోపాల నివారణ, విద్యా పురోగతిని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (National Deworming Day) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

ఈ కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యువతకు ఆల్బెండాజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలు, అవసరమైన ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాల ద్వారా మాత్రలు అందజేయనున్నారు. పాఠశాలకు వెళ్లని పిల్లలకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి మాత్రలు అందజేస్తారు.

**నులిపురుగుల వల్ల కలిగే నష్టాలు**



పేగుల్లో నివసించే నులిపురుగులు కలుషితమైన నీరు, అపరిశుభ్రమైన ఆహారం, చేతులు కడుక్కోకుండా భోజనం చేయడం, బహిరంగ మలవిసర్జన వంటి కారణాల వల్ల శరీరంలోకి ప్రవేశిస్తాయి. వీటి కారణంగా రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం, జ్ఞాపకశక్తి తగ్గడం, చదువుపై ఏకాగ్రత లోపించడం, అలసట, బలహీనత, కడుపు నొప్పి, ఆకలి తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

**మాత్ర మోతాదు ఇలా**

1–2 సంవత్సరాల పిల్లలకు 200 మి.గ్రా. (400 మి.గ్రా. మాత్రలో సగం) చూర్ణం చేసి ఇవ్వాలి.

2–19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యువతకు 400 మి.గ్రా. పూర్తి మాత్రను చూర్ణం చేసి ఇవ్వాలి. భోజనం చేసిన తర్వాత మాత్ర ఇవ్వడం మంచిదని, చిన్నపిల్లలకు చూర్ణం చేసి ఇవ్వాలని అధికారులు తెలిపారు.

**ఎవరికి ఇవ్వకూడదు**

ఒక సంవత్సరం లోపు శిశువులకు ఆల్బెండాజోల్ మాత్ర ఇవ్వకూడదని, తీవ్ర అనారోగ్యంతో ఉన్న పిల్లలకు కోలుకున్న తర్వాత మాత్రమే ఇవ్వాలని సూచించారు. వైద్యుల ప్రత్యేక సూచనలు ఉంటే వాటిని తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

**పాటించాల్సిన జాగ్రత్తలు**

సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం, మరుగుదొడ్లను మాత్రమే ఉపయోగించడం, పరిశుభ్రమైన తాగునీటిని వినియోగించడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి తినడం, గోర్లు చిన్నగా ఉంచుకోవడం, ఎల్లప్పుడూ చెప్పులు ధరించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా నులిపురుగుల బారిన పడకుండా నివారించవచ్చని అధికారులు తెలిపారు.

**ప్రజలకు విజ్ఞప్తి**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంరక్షకులు తమ పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రను తప్పనిసరిగా వేయించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని వైద్య ఆరోగ్య శాఖ పిలుపునిచ్చింది.

# సర్ గడువును ఆరు నెలలు పొడిగించాలి:

**తలసాని శ్రీనివాస్ యాదవ్**

**హైదరాబాద్, జూలై 13**

ప్రత్యేక ఓటరు సవరణ (SIR) కార్యక్రమం గడువును ఆరు నెలలు పొడిగించాలని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో SIR కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన, ఈ సందర్భంగా పలువురు ఓటర్లు తమ సమస్యలను వివరించారని తెలిపారు.

ఎన్యుమరేటర్ ఫారాలు నింపే విషయంలో బీఎల్‌వోలకే సరైన అవగాహన లేదని, సిబ్బంది కూడా తగినంతగా లేరని ఆయన విమర్శించారు. అదనపు సిబ్బందిని నియమించి ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. 2002 నాటి ఓటరు జాబితాలు బీఎల్‌వోల వద్ద అందుబాటులో లేవని, అప్పటి నియోజకవర్గాల పరిధులు ప్రస్తుతం మారిపోవడంతో ఫారాల భర్తీలో తీవ్ర గందరగోళం నెలకొందని పేర్కొన్నారు.



ఈ నెల 24తో SIR కార్యక్రమం గడువు ముగియనున్న నేపథ్యంలో ఇప్పటివరకు 10 శాతం కూడా పూర్తి కాలేదని, మిగిలిన 11 రోజుల్లో 100 శాతం పూర్తి చేయడం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా SIR గడువును ఆరు నెలలు పొడిగించాలని ఎన్నికల అధికారులను కోరారు.

# బోనాల జాతరకు సర్వం సిద్ధం..

**3,427 దేవాలయాలకు రూ.15.05 కోట్ల నిధులు**

**హైదరాబాద్, జూలై 13**




తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన ఆషాఢ బోనాల ఉత్సవాలను జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. జూలై 16న గోల్కొండ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. జూలై 20–22 వరకు బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాలు, ఆగస్టు 2న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు, ఆగస్టు 3న రంగం, ఆగస్టు 9న లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాలు జరుగనున్నాయి. పాత జీహెచ్ఎంసీ పరిధిలోని 3,427 దేవాలయాలకు బోనాల ఉత్సవాల కోసం రూ.15.05 కోట్ల నిధులు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్, వైద్య సేవలు, భద్రత, ప్రత్యేక ఆర్టీసీ బస్సులు, పూలు, విద్యుద్దీపాలంకరణ వంటి అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజా, భాగ్యలక్ష్మి ఆలయం తదితర ప్రధాన దేవాలయాల్లో ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సుల సౌకర్యాన్ని వినియోగించుకుని రాష్ట్రవ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# బస్తీ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

**కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా**

**హైదరాబాద్, జూలై 13**

జిల్లాలోని అన్ని బస్తీ దవాఖానల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఇంటింటి ఫీవర్ సర్వేను తప్పనిసరిగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం బహదూర్‌పుర మండలం కిషన్‌బాగ్ బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, రికార్డులు, మందుల నిల్వలు, పరీక్షల వివరాలు, ఇంటింటి ఫీవర్ సర్వే,



క్లస్టర్ వైద్య కార్యక్రమాలు, సిబ్బంది హాజరు, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. బస్తీ దవాఖానల్లో ఎక్కడా మందుల కొరత లేకుండా చూడాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఫీవర్ సర్వే ద్వారా రోగులను గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్న కలెక్టర్, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి రూ.4,000 ఆర్థిక సహాయం

- **నర్సింగ్ రావు కుటుంబ సభ్యులకు పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు**

**ఆలేరు జూలై 13 :**

ఆలేరు పట్టణంలోని 1వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తుమ్మ నర్సింగరావు కుటుంబ సభ్యులకు రూ.4,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నర్సింగరావు కుటుంబ



సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో 1వ కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుడు ఎలుగల నరేందర్ మాట్లాడుతూ పార్టీ కోసం సేవలందించిన కార్యకర్తలను, వారి కుటుంబాలను ఆదుకోవడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతగా భావిస్తుందని తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలవడం ప్రతి కార్యకర్త కర్తవ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సరబ్ కృష్ణ, పూల సత్తయ్య, దారపు శంకర్, మల్యాల మహేష్, తాడెం యాదగిరి, దొనకొండ లాస్య కృష్ణ, మద్దెల భాను, నౌండ్ల గౌతం, సామల సాయి, బొడ్డు తరుణ్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు విద్యే పునాది: తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్, జూలై 13**

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు విద్య ఎంతో ప్రధానమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ హైదర్‌బస్తీలోని హిందీ మహా విద్యాలయంలో తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 160 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించాలంటే పాఠశాలల్లో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసిన తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, అసోసియేషన్ ప్రతినిధులు అభిషేక్ విజయ్, శ్రీనాధ్, మాశెట్టి శ్రీనివాస్, విజయ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, ఆంజనేయులు, నార్ల దీపక్ గుప్తా, కోటేశ్వర్ గౌడ్, గణేష్, అభిషేక్, జనార్దన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం.

**డాక్టర్ అమూల్య ప్రియదర్శిని**



**దౌల్తాబాద్ మండలం, జులై,13**

నులిపురుగుల నివారణలో భాగంగ సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌల్తాబాద్ మండల కేంద్రంలో కాలేజ్ విద్యార్థులకు ఆల్బండోజల్ మాత్రలను వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని పంపిణీ చేశారు ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ... నులిపురుగుల నివారణతోనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారు అని అన్నారు. మండలం లోని ప్రతి పాఠశాల, అంగన్వాడీ, లోని విద్యార్థులు అందరికీ మాత్రలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు, ఈ కార్యక్రమంలో వసంత ప్రిన్సిపాల్, సూపర్ వైజర్ రఫీ,ఎఎన్.ఎం లు అనిత, అనురాధ పాల్గొన్నారు.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం..

**ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ప్రారంభం**



**నిజామాబాద్, జూలై 13**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాక్లూర్ మండలం దాస్‌నగర్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే హైస్కూల్‌లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ భుజంగరావు ప్రారంభించారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లలోపు 3,90,297 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం పాటించాలని సూచించారు. ఈరోజు మాత్రలు తీసుకోని విద్యార్థులకు జూలై 20న మాప్–అప్ కార్యక్రమంలో అందజేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజశ్రీ తెలిపారు.

# నేడు ఈఎస్ఐసీ ఆస్పత్రి సనత్‌నగర్‌లో కొత్త ఓపీడీ బ్లాక్ ప్రారంభోత్సవం




**హైదరాబాద్, జూలై 13**

సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ ఆస్పత్రిలో నూతన ఓపీడీ బ్లాక్‌ను జూలై 14 (మంగళవారం) మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రి డా. మన్సుఖ్ మాండవీయ, కేంద్ర కార్మిక, ఉపాధి, సూక్ష్మ, చిన్న & మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే, కేంద్ర బొగ్గు & గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారు. ప్రారంభోత్సవం అనంతరం నూతన ఓపీడీ బ్లాక్‌ను సందర్శించి, సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అలాగే ఐదుగురు ఈఎస్ఐ లబ్ధిదారులకు నగదు ప్రయోజనాలు అందజేయడంతో పాటు, ఓపీడీ బ్లాక్ నిర్మాణంలో పాల్గొన్న ఐదుగురు నిర్మాణ కార్మికులను సత్కరిస్తారు.

# ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

**ఖమ్మం, జూలై 13**

: ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం. నాగరాజును జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ఈ భేటీలో పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 13 (సమయం న్యూస్ )**

సింగరేణి భరోసా యాత్రలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఇల్లందు క్రాస్ రోడ్‌లోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మొక్కను అందజేసి జిల్లా యంత్రాంగం తరఫున ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలపై మంత్రితో స్వల్పంగా చర్చించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కామన్ డైట్ మెనూ అమలు చేయాలి: కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట, జూలై 13**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కామన్ డైట్ మెనూను పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. కొండపాక మండలం దుద్దెడ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల హాజరు మేరకు వంట సామగ్రి వినియోగించడం, భోజనాన్ని ఉపాధ్యాయులు పర్యవేక్షించడం, పాఠశాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేసి ఆకుకూరలను వంటల్లో వినియోగించాలని సూచించారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, జూలై 13**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందికి నిర్వహించిన ఉచిత సమగ్ర వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె బీపీ పరీక్ష చేయించుకుని, ఉద్యోగులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. యశోద హాస్పిటల్స్, శరత్ మాక్సీ విజన్ వైద్య బృందాలు జనరల్ ఫిజీషియన్, గుండె, స్త్రీ, నేత్ర విభాగాల్లో పరీక్షలు నిర్వహించగా, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలు పొందారు.

# ఎల్‌నినో ప్రభావానికి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు: మంత్రి తుమ్మల



**సంగారెడ్డి, జూలై 13**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో మూడు దశల్లో కంటింజెన్సీ ప్రణాళిక అమలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమీక్షలో జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రామాణికంగా తీసుకుని జిల్లా వారీ కార్యాచరణ చేపట్టాలని సూచించారు. వర్షాలు ఆలస్యమైనా రైతులకు నష్టం కలగకుండా వరికి బదులుగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ప్రోత్సహించాలని, స్వల్పకాలిక విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని, వాతావరణ ఆధారిత వ్యవసాయ విధానాలను విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో వివిధ శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావం, తేమ సంరక్షణ, సూక్ష్మ నీటిపారుదల, పంటల వైవిధ్యీకరణపై ప్రజెంటేషన్లు ఇచ్చారు.

# బహదూర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ప్రీ–ప్రైమరీ స్కూల్ ప్రారంభం

**ఆలేరు, జూలై 13 :**



ఆలేరు మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు బహదూర్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ స్కూల్‌ను ప్రారంభించారు. పాఠశాలలో ప్రీ–ప్రైమరీ తరగతులను ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయురాలు మమత ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దృష్టికి తీసుకురాగా దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి ప్రీ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు ప్రీ ప్రైమరీ స్కూల్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బహదూర్‌పేట ప్రజలు, పాఠశాల సిబ్బంది ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు చిన్నారులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి (ఎంఈఓ), బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ కుండె సంపత్, రిపోర్టర్ కూళ్ల సిద్దులు, కాంగ్రెస్ నాయకులు వట్టిపల్లి రాజు, వట్టిపల్లి లక్ష్మణ్, కమ్మపల్లి శ్రీరాములు, కూళ్ల మల్లయ్య, కమ్మపల్లి శివకుమార్, పర్శ నరేష్, ఎన్ఎస్‌యూఐ

# ప్రీ ప్రైమరీ సిబ్బందికి నియామక పత్రాలు అందజేసిన ఎంఈఓ



నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ

**ఆలేరు, జూలై 13 :**

ఆలేరు మండల పరిధిలోని ఐదు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విభాగానికి ఎంపికైన ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలు సోమవారం విధుల్లో చేరారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన నియామక ప్రక్రియలో ఎంపికైన వారు ఆయా పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించినట్లు మండల విద్యాధికారి (ఎంఈఓ) ఎర్ర లక్ష్మీ తెలిపారు. బహదూర్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్‌గా అంగడి అరుణ, ఆయాగా సాంబరాజు స్వప్న, కొలనుపాక పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్‌గా బొడ్డు అశ్విని, ఆయాగా బోయిని రేణుక, గొలనుకొండ పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్‌గా జేరిపోతుల అశ్విని, ఆయాగా జోలం కవిత, టంగుటూరు పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్‌గా శాతెల్లి రేణుక, ఆయాగా గజరాజు శిరీష, శ్రీనివాసపురం పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్‌గా మచ్చ రజిత, ఆయాగా ఏంటుక రవళి బాధ్యతలు చేపట్టారు. ప్రీ–ప్రైమరీ విద్యను మరింత బలోపేతం చేసి చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, విధుల్లో చేరిన సిబ్బంది చిన్నారుల సమగ్ర వికాసానికి కృషి చేయాలని మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మీ సూచించారు.

# ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- **మక్తల్ సభలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి.**

**మక్తల్ మున్సిపల్( మండలం), జులై,13**



నారాయణపేట జిల్లా మక్తల్ నియోజక వర్గంలో రూ. 573.28 కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు జిల్లా మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి తో కలిసి శంకుస్థాపన చేసిన కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి.రాష్ట్ర ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థను అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మక్తల్ నియోజకవర్గంలో హ్యామ్ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమం కోసం విచ్చేసిన రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గార్లకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘన స్వాగతం పలికారు.అనంతరం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్ తో పాటు ప్రజాప్రతినిధులు కలిసి రూ.237 కోట్లతో నిర్మించనున్న మక్తల్–నారాయణపేట నాలుగు లైన్ల హ్యామ్ రోడ్డుకు శంకుస్థాపన చేసి, హ్యామ్ రోడ్ల పైలాన్‌ను మంత్రి కోమటి రెడ్డి. వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...మక్తల్ నియోజకవర్గంలో రూ.573.28 కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేశాం. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రి కాక ముందు నుంచే ప్రతి సమావేశంలో మక్తల్–నారాయణపేట రహదారి గురించి ప్రస్తావిస్తూ, ఈ రోడ్డు నిర్మాణాన్ని మంజూరు చేయాలని నిరంతరం కోరేవారని, ఆ విజ్ఞప్తికి అనుగుణంగానే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందని ఆయన తెలిపారు.గతంలో తాను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రిగా ఉన్నానని, ఇక్కడి రహదారుల పరిస్థితిపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉందనీ, గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్, రవాణా, ఆర్అండ్‌బీ శాఖల్లో చేపట్టిన పనులకు సుమారు రూ.40 వేల కోట్ల బకాయిలు మిగిల్చడంతో పాటు రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పుల భారం రాష్ట్రంపై మోపారని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు రోడ్లను సరిగా అభివృద్ధి చేయకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆయన విమర్శించారు.ఈ రోజు శంకుస్థాపన చేసిన మక్తల్–నారాయణపేట రహదారిని 12 నుంచి 16 నెలల్లో పూర్తి చేసి, ప్రజలు కేవలం 20 నిమిషాల్లో నారాయణపేటకు చేరుకునేలా నిర్మిస్తామని తెలిపారు. రహదారి విస్తరణకు ప్రజలు సహకరించి అవసరమైన భూమిని ఇవ్వాలని, భూములు ఇచ్చే వారికి ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందిస్తుందనీ, రహదారి నిర్మాణం విషయంలో అవసరమైన పరిపాలన అనుమతులన్నింటినీ తొందరగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ను మంత్రి ఆదేశించారు.మంచి రహదారులు ఉంటేనే పరిశ్రమలు వస్తాయనీ, వ్యాపారాలు పెరుగుతాయని, యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, అభివృద్ధికి నాణ్యమైన రోడ్లే పునాది అని మంత్రి పేర్కొన్నారు.గత ప్రభుత్వ కాలం నాటి బిల్లుల కోసం ఇప్పటికీ కాంట్రాక్టర్లు తిరుగుతున్నా, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు .రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్లతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందనీ, అన్నింటికి కలిపి ఏడాదికి 50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.గత పదేళ్లలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వని పరిస్థితి ఉండగా, తమ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని చెప్పారు.తాము ప్రచారం కంటే పనులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాం అని మంత్రి స్పష్టం చేశారు. సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఒక్క ప్యాకేజీలో రూ. 547 కోట్లు అందులో 4 లైన్ల రోడ్డు నిర్మాణం అంటే ఆషామాషీ కాదు అని అన్నారు. రోడ్డు వ్యవస్థ ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి పట్టుదల, ఏమన్నా చేయాలన్న తపన ఉన్న నాయకుడు అని కొనియాడారు. సాగునీటి పరంగా మక్తల్ మంచి పురోగతి సాధిస్తుందని, వచ్చే ఎన్నికల నాటికి సాగునీటి వనరులు ఇక్కడ గణనీయంగా పెరుగుతాయని జూపల్లి తెలిపారు.ఈ రెండున్నర సంవత్సరాల కాలంలోనే 30వేల కోట్ల తో ఇందిరమ్మ ఇండ్లను నిర్మింప చేస్తున్నామన్నారు. ఇటీవల రోజు 1000 కోట్లు రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ప్రతీ నియోజక వర్గంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మింప చేస్తున్నామని మంత్రి తెలిపారు. వాకిటి శ్రీహరి నేతృత్వంలో మక్తల్ నియోజక వర్గ రూపురేఖలు మారుతాయని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.సభకు అధ్యక్షత వహించిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ...మక్తల్ నియోజకవర్గంలో ఈరోజు ప్రారంభమైన రోడ్ల నిర్మాణ పనులు చారిత్రాత్మకమైనవని అన్నారు. ప్రజాప్రభుత్వం ప్రజల అవసరాలనే ప్రాధాన్యంగా తీసుకొని ఈ భారీ రహదారి ప్రాజెక్టులను మంజూరు చేసిందని తెలిపారు.మక్తల్ నుంచి నారాయణపేట వరకు రహదారి నిర్మాణం ఎన్నో ఏళ్లుగా అగ్నిపరీక్షగా మారిందన్నారు. దాదాపు పది మంది జిల్లా పాలన అధికారులు, పలువురు ఎమ్మెల్యేలు మారినా ఈ రోడ్డు మంజూరు కాలేదని గుర్తు చేశారు.గత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో గొప్పలు చెప్పిందని, కానీ నాణ్యమైన రహదారుల నిర్మాణంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నిర్మించిన రహదారులు కూడా నాసిరకంగా ఉండటంతో వందలాది గుంతలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల రవాణా కష్టాలు తొలగించాలనే సంకల్పంతో రూ.237 కోట్లతో మక్తల్–నారాయణపేట నాలుగు లైన్ల రహదారిని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.మక్తల్ నియోజకవర్గానికి ఏ అభివృద్ధి పని కోరినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రులు వెంటనే సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని, ఇందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన మక్తల్ నియోజకవర్గం ఇప్పుడు అభివృద్ధి బాటలో దూసుకుపోతోందని, ప్రజలు స్వేచ్ఛగా, గౌరవంగా జీవించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.మక్తల్ అభివృద్ధి ప్రయాణానికి ప్రజల ఆశీర్వాదం, సహకారం ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస, మార్కెట్ చైర్మన్ లు రాధా లక్మారెడ్డి, సదా శివా రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, ఆర్ అండ్ బీ సీ . ఈ .వెంకటేశ్వర్ రావు, ఎస్.ఈ రాజేందర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లా లో 45 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ చేపట్టడం జరిగింది

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ.**

**వికారాబాద్, జులై,13**





జిల్లా లో 45 శాతం ఎస్ఐఆర్ టిజిటలైజేషన్ జరిగింది జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు.సోమవారం ప్రత్యేక సమగ్ర సవరణ పై జిల్లాల వారీగా ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ జిల్లాలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు వాలంటరీలను, ఆశా వర్కర్లను, కళాశాల విద్యార్థుల సహకారం తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ... ప్రతిరోజు తప్పనిసరిగా 10 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టేందుకు చొరవ చూపాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ లో వెనుకబడి ఉందని, అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించి డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇప్పటికి పెండింగ్ లో ఉన్న ఎన్యూమరేషన్ ఫారంలను వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత, ఆర్డీఓవాసు చంద్ర, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెమత్ అలీ తదితరులు ఉన్నారు.

చురకలు



# పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులు,...

- **పోలీస్ క్రీడాకారులను అభినందించిన జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్...**

**వికారాబాద్, జులై,13**



వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన పోలీస్ అధికారులకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ సేవా పతకాలను, అలాగే ఇటీవల నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ & స్పోర్ట్స్ మీట్–2026 (క్లస్టర్-A) లో పతకాలు సాధించిన 8 మంది పోలీస్ క్రీడాకారులను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS సన్మానించి అభినందించారు.నూతన సంవత్సర దినోత్సవం (01-01-2026) సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన ఉత్తర్వుల మేరకు జిల్లా పరిధిలో ఉత్తమ సేవలు అందించిన ఎ. శ్రవణ్ కుమార్ (ASI), జి. ప్రకాష్ (ARSI), కె. మోహన్ రాజ్ (ARSI), పి. సంజీవయ్య (ARSI), ఎస్. విఠలయ్య (ARSI)లకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ సేవా పతకాలను ఎస్పీ ప్రదానం చేశారు.రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో వికారాబాద్ జిల్లా పోలీస్ జట్టు 3 రజత, 5 కాంస్య పతకాలతో మొత్తం 8 పతకాలు సాధించింది. WPC స్రవంతి (ఆర్మ్ రెజ్లింగ్–50 కేజీలు), PC శివదర్శన్ (వెయిట్ లిఫ్టింగ్–60 కేజీలు), PC మహేందర్ (ఆర్మ్ రెజ్లింగ్–85 కేజీలు) రజత పతకాలు సాధించగా, WPC రేణుక (వుషు–60 కేజీలు), WPC కవిత (బాక్సింగ్–50 కేజీలు), WPC వినోద (ఆర్మ్ రెజ్లింగ్–65 కేజీలు), PC జై ఆనంద్ (ఆర్మ్ రెజ్లింగ్–70 కేజీలు), PC శ్రీనివాస్ (ఆర్మ్ రెజ్లింగ్–60 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. వీరందరినీ ఎస్పీ ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సేవా పతకాలు అందుకోవడం ప్రతి పోలీస్ అధికారికి అత్యంత గౌరవప్రదమైన విషయమని, అవి విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపని తెలిపారు. ఈ గుర్తింపు మరింత బాధ్యతతో ప్రజలకు సేవలందించేలా ప్రతి అధికారిని ప్రేరేపిస్తుందని అన్నారు. వికారాబాద్ జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ అధికారి శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకుంటూ, వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు.రాబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లోనూ ఇదే స్ఫూర్తితో పాల్గొని మరిన్ని పతకాలు సాధించి వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

# సింగరేణి అధికారుల సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకోవాలి

**భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, జూలై 13**



సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 2,200 మంది అధికారుల వేతన సవరణ, పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ (PRP) సహా పెండింగ్ సమస్యలపై రెండు నుంచి మూడు నెలల్లో సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్ (పర్సనల్ & ఫైనాన్స్) గౌతమ్ పోట్రుతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ సూచనలు చేశారు. అధికారుల్లో అసంతృప్తి లేకుండా సంఘ నాయకులతో చర్చించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. మారుతున్న పరిస్థితుల్లో బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని పెంచి సంస్థను బహుముఖ రంగాల్లో అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తాడిచర్ల–2 బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరులో కీలక పాత్ర పోషించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు అధికారుల తరఫున పూర్తి సహకారం అందిస్తామని వారు వెల్లడించారు.

# నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఆధార్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహణ

**నారాయణపేట, జులై,13**

నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఆధార్ ఆపరేటర్లకు ఆధార్ నమోదు మరియు నవీకరణ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో యూఐడీఏఐ (UIDAI) తెలంగాణ రాష్ట్ర మేనేజర్ నరేష్ చంద్ర ప్రధాన వక్తగా పాల్గొని, ఆధార్ నమోదు మరియు అప్డేట్ ప్రక్రియ, ఈ–ప్రాసెస్ విధానం, ధృవీకరణ ప్రక్రియలు, వివిధ ఆధార్ సేవలకు అవసరమైన చెల్లుబాటు అయ్యే సహాయక పత్రాల (Supporting Documents) గురించి సవివరంగా అవగాహన కల్పించారు. అలాగే, యూఐడీఏఐ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన మరియు నాణ్యమైన సేవలను అందించాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఆధార్ ఆపరేటర్లందరూ పాల్గొన్నారు. అలాగే కె. విజయ్ కుమార్, EDM, కె. రామ్ మోహన్, జిల్లా మేనేజర్ (DM) మరియు శివ ప్రసాద్, జిల్లా మేనేజర్ (పాఠశాల విద్య) హాజరయ్యారు.శిక్షణ సందర్భంగా పాల్గొన్న ఆపరేటర్ల సందేహాలకు సమాధానాలు ఇవ్వడంతో పాటు, ఆధార్ సేవల నిర్వహణలో నాణ్యత, ఖచ్చితత్వం మరియు సామర్థ్యాన్ని పెంపొందించే అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.




# పూడూరు మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే డాక్టర్. టీ. రామ్మోహన్ రెడ్డి

**పూడూర్ మండలం, జులై,13**




వికారాబాద్ జిల్లా పూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో పూడూరు మండలంలోని అన్ని శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (SIR) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మండలంలో అమలవుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రైతుల సమస్యలను ప్రాధాన్యతగా పరిగణించి త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్

**కొడంగల్ ,జులై,13**

అప్పాయిపల్లి గ్రామంలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించిన కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ బొడ్రాయి వెంకటయ్య కన్వీనర్ మల్లేష్ బి ఎల్ ఏ బాలరాజ్ గ్రామపంచాయతీ సెక్రటరీ శేఖర్ నాయకులు గోకుల్ సింగ్ రాములు నారాయణ తదితరులు పాల్గొన్నారు

# సైబర్ నేరాల నియంత్రణకు డాట్ భద్రతా సదస్సు

**హైదరాబాద్, జూలై 13**

సైబర్ మోసాలు, టెలికాం సంబంధిత నేరాలు, కొత్తగా ఉద్భవిస్తున్న సైబర్ భద్రతా ముప్పులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అంతర్‌శాఖల సమన్వయాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో టెలికమ్యూనికేషన్స్ శాఖ (డాట్) హైదరాబాద్ యూనిట్ (ఏపీ ఎల్ఎస్ఏ) సోమవారం హైదరాబాద్‌లో భద్రతా సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుకు డైరెక్టర్ జనరల్ (టెలికాం) ఆనంద్ ఖరే అధ్యక్షత వహించగా, స్పెషల్ డైరెక్టర్ జనరల్ దీపా అరోరా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్, సీఐడీ, డాట్ ప్రధాన కార్యాలయం, డాట్ ఏపీ ఎల్ఎస్ఏ అధికారులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), టెలికాం సేవల సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల జాతరకు సర్వం సిద్ధం – 3,427 ఆలయాలకు రూ.15.05 కోట్ల నిధులు

**హైదరాబాద్, జూలై 13 :**

ఆషాఢ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు గోల్కొండ నుంచి లాల్‌దర్వాజా వరకు జరిగే ఉత్సవాలకు 3,427 ఆలయాలకు రూ.15.05 కోట్ల నిధులు విడుదల చేశారు. భక్తుల కోసం తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్, వైద్య, భద్రత, ప్రత్యేక ఆర్టీసీ బస్సులు తదితర ఏర్పాట్లు చేసినట్లు హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రధాన ఉత్సవాలు:

**జూలై 16:** గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనాల ప్రారంభం

**జూలై 20–22:** బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కోలు, కల్యాణం, రథోత్సవం

**ఆగస్టు 2:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు

ఆగస్టు 3: రంగం కార్యక్రమం

**ఆగస్టు 9:** లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాలు ప్రధాన ఆలయాల్లో ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పణ జరుగుతుందని, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందున రాష్ట్రవ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# దేవాదుల పనులకు రూ.146 కోట్లు విడుదల

## 22 రిజర్వాయర్లను నింపడమే లక్ష్యం: భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూలై 13:**

దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.146 కోట్లను తక్షణమే విడుదల చేసినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును సందర్శించిన అనంతరం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం బ్యారేజీలపై డ్యామ్ సేఫ్టీ అథారిటీ, సీడబ్ల్యూసీ నివేదికల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటామని, పూర్తి మరమ్మతులు పూర్తయ్యే వరకు గేట్లు మూసే ప్రసక్తే లేదన్నారు. విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, అవినీతి కారణంగానే కాళేశ్వరం బ్యారేజీలు దెబ్బతిన్నాయని ఆరోపించిన భట్టి, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి, ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టులు ఇప్పటికీ పటిష్ఠంగా ఉన్నాయని పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టు భూసేకరణకు రూ.58 కోట్లు, నిర్మాణ పనులకు రూ.74 కోట్లు, నిర్వహణకు రూ.14 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 10 పంపులను నిరంతరాయంగా నడుపుతూ 12 జిల్లాలకు నీరందించడం, 22 రిజర్వాయర్లను నింపడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేవాదుల, సీతారామ, ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులను పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రాంతంలోని 17 నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందిస్తామని తెలిపారు.

# హైదరాబాద్ లో ఎన్‌సీఎస్ సీ రాష్ట్ర కార్యాలయ నూతన భవనం ప్రారంభం

## రెండేళ్లలో దేశవ్యాప్తంగా 60 వేల కేసుల పరిష్కారం: కిశోర్ మక్వానా



**హైదరాబాద్, జూలై 13**

హైదరాబాద్‌లోని సీజీఓ టవర్స్‌లో పునరుద్ధరించిన జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ) రాష్ట్ర కార్యాలయాన్ని కమిషన్ ఛైర్మన్ కిశోర్ మక్వానా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా 60 వేలకుపైగా కేసులను పరిష్కరించడం కమిషన్ చరిత్రలోనే అత్యధికమని తెలిపారు. హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం 2024–2026 కాలంలో 10,853 ఫిర్యాదులను పరిష్కరించడంతో పాటు, ఎస్సీ/ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద బాధితులకు ₹33.80 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించిందని వెల్లడించారు. అలాగే 177 స్వయంప్రేరిత (సువో మోటో) కేసులు నమోదు చేసి, 127 చట్టబద్ధ విచారణలు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్‌సీఎస్‌సీ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ కమిషన్‌కు నోటీసులు జారీ చేయడం, సమన్లు పంపడం, అవసరమైతే కఠిన చర్యలు తీసుకునే అధికారాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యదర్శి గుడే శ్రీనివాస్ ఐఏఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో డిజిటల్ సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు.

# మహిళల భద్రతకు 'సహచరి' – మల్కాజిగిరి పోలీసుల వినూత్న కార్యక్రమం

**హైదరాబాద్, జూలై 13**

మహిళల భద్రత, సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ "సహచరి" పేరుతో వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం తెలంగాణ పోలీసింగ్‌లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోంది. మహిళల రక్షణ, సాధికారత, కుటుంబ సంక్షేమం, సామాజిక భద్రత అనే నాలుగు ప్రధాన అంశాలపై రూపొందించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (SERP) భాగస్వామ్యం కావడం విశేషం. మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, పోలీసులు, స్థానిక సమాజం కలిసి పనిచేసే సమగ్ర నమూనాగా దీనిని రూపొందించారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే నివారించడం, బాధిత మహిళలకు చట్టపరమైన, మానసిక, సామాజిక సహాయం అందించడం ద్వారా మహిళల్లో భద్రతా భావనను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పోలీస్ కమిషనరేట్ వెల్లడించింది.

# దిగ్విజయంగా తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ కార్యక్రమం





### క్రీడా అవగాహన కార్యక్రమాలు

**కొడంగల్ ,బొంరస్ పేట , జులై,13**

గ్రామీణ స్థాయి వరకు నాణ్యమైన క్రీడా విజ్ఞానాన్ని అందించి, రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (Sports Authority of Telangana) ఆధ్వర్యంలో నిర్వహించిన "తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్" కార్యక్రమం కొడంగల్ టౌన్ బొంరస్ పేట మండల కేంద్రాలలో విజయవంతంగా నిర్వహించ బడింది.తెలంగాణ క్రీడా శాఖ రూపొందించిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా క్రీడా నిపుణుల జ్ఞానాన్ని రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం, జిల్లాకు చేరవేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.ప్రతి మొబైల్ బృందంలో ముగ్గురు కోచ్‌లు, ఒక ఫిజియోథెరపిస్టు, ముగ్గురు సీనియర్ క్రీడాకారులు, ఒక ప్రత్యేక అధికారి పాల్గొని క్రీడలకు సంబంధించిన శాస్త్రీయ అవగాహన, ప్రాయోగిక శిక్షణ, మార్గదర్శకాన్ని అందించారు. ఇందుకు అవ సరమైన ప్రత్యేక శిక్షణ కిట్లను కూడా వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానంగా క్రీడల ప్రాథమిక నైపుణ్యాలు, ఆధునిక సాంకే తికతలు, గాయాల నివారణ, పునరావాసం, పునరుద్ధరణ, హైడ్రేషన్, క్రీడా పోషకాహారం, ఒత్తిడి నిర్వహణ, క్రీడాకారుల మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఇటీవల స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభ కార్యక్రమం లో గచ్చిబౌలి స్టేడియంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇండియన్ ఒలింపిక్ అసోసి యేషన్ అధ్యక్షురాలు పి.టి. ఉష చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం. ఆయా జిల్లాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు (PETలు), ఫిజికల్ డైరెక్టర్లు (PDలు), సీనియర్ క్రీడాకారులు, స్పోర్ట్స్ అథారిటీ అకాడమీ క్రీడాకారులు, కోచ్‌లు కోచ్‌లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (PETలు), ఫిజికల్ డైరెక్టర్లు (PDలు), క్రీడాకారులు,క్రీడాభిమానులకు రిఫ్రెషర్ శిక్షణ అందించారు. ఈ శిక్షణ పొందిన కోచ్‌లు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు తమ పరిధిలోని ప్రాథమిక స్థాయి క్రీడాకా రులకు అదే విజ్ఞానాన్ని అందించేలా ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన క్రీడా విజ్ఞానాన్ని చేరవేయడం ద్వారా రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయడం, కోచింగ్ ప్రమాణాలను మెరుగుపరచడం, శాస్త్రీయ క్రీడా శిక్షణను ప్రోత్సహించడం, ప్రతి జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకా రులను తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు.క్రీడా విజ్ఞానాన్ని మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లే ఈ కార్యక్రమానికి క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. కోచింగ్ ప్రమాణాలను పెంపొందించి, శాస్త్రీయ క్రీడా శిక్షణను విస్తృత స్థాయిలో అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయని వారు అభిప్రాయపడ్డారు. నాలుగు రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను హైద రాబాద్‌లోని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు నిరంతరం సమన్వయం చేస్తూ, స్వయంగా పలు జిల్లాలను సందర్శించి పర్య వేక్షించారు.ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ,క్రీడల్లో క్రియాశీలకంగా ఉన్న ప్రాంతాలకు విస్తరించి మరింత మంది క్రీడా కారులకు ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ పి ఆర్ ఓ కాలేరు సురేష్,స్పోర్ట్స్ అథారిటీ కోచ్ లు పని కిషోర్ ఆనంద్ వినోద్ ఫిజియోథెరపిస్ట్ సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## ఉద్యమకారుల సంక్షేమ డిమాండ్లపై కమిటీ సానుకూల స్పందన



**హైదరాబాద్, జూలై 13**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సోమవారం అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల ఉద్యమకారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించింది. కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొని ఉద్యమకారుల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో ఉద్యమకారుల సంక్షేమ కమిషన్‌కు చట్టబద్ధ హోదా, ఉద్యమకారుల పిల్లలకు విద్యా–ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమం, జీవితకాల ఉచిత ఆర్టీసీ ప్రయాణం, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, అర్హులైన వారికి 250 గజాల ఇంటి స్థలం, గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్, ఉచిత కార్పొరేట్ వైద్య సేవలు వంటి ప్రధాన డిమాండ్లను ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను సమగ్ర నివేదికలో చేర్చి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి సమర్పిస్తామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. జూలై 22 వరకు జిల్లాల వారీగా ముఖాముఖి సమావేశాలు కొనసాగనున్నట్లు వెల్లడించారు.

## సాంస్కృతిక సారథి కళాకారుడు శంకరయ్యకు సన్మానం



**భూపాల పల్లి జూలై 13**

తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు మైసా శంకరయ్య (ఎర్రన్న) బదిలీ నేపథ్యంలో జిల్లా డిపిఆర్వో కార్యాలయంలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డిపిఆర్వో శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ, కళాజాత కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో శంకరయ్య విశేష సేవలందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రవల్లికకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

**హైదరాబాద్, జూలై 13:**

చైనాలోని ఒర్డోస్‌లో జరిగిన తొలి ఆసియా అండర్–23 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2026లో మహిళల 4×400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి ప్రవల్లిక నరిమళ్లను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. నల్గొండ ఎస్సీ గురుకుల డిగ్రీ కళాశాలలో చదువుతూ, డిండి గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందిన ప్రవల్లిక అంతర్జాతీయ వేదికపై రాణించడం తెలంగాణకు గర్వకారణమని సీఎం పేర్కొన్నారు. తాపీ మేస్త్రీ కుమార్తెగా కష్టపడి ఈ స్థాయికి చేరుకోవడం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రవల్లిక, శ్రావణి సచిన్ సాంగ్లే, సాంద్రమోల్ సాబు, నోఫిసా ఖతూన్‌లతో కూడిన భారత జట్టు 3:33.62 నిమిషాల సమయంలో రేసు పూర్తి చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని ఆతిథ్య చైనాను వెనక్కి నెట్టింది. ప్రవల్లిక ఇప్పటికే దేశీయ స్థాయిలో 23 స్వర్ణాలతో కలిపి మొత్తం 35 పతకాలు సాధించారని, ఆమె కోచ్‌లను కూడా సీఎం అభినందించారు. ఈ చాంపియన్‌షిప్‌లో మొత్తం 16 పతకాలతో రాణించిన భారత అథ్లెట్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సత్తా చాటిన కోటగిరి కానిస్టేబుల్:

- **కరాటేలో 'బంగారు' పతకం సాధించిన అరుణ్ కుమార్**
- **కోటగిరి పోలీస్ స్టేషన్‌కు ప్రతిష్టాత్మక గౌరవం: ఘనంగా సన్మానించిన ఎస్సై శ్రీనివాస్***




**కోటగిరి, జూన్ 13 :-**

రాష్ట్రస్థాయిలో జరిగిన పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కోటగిరి పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ అరుణ్ కుమార్ కరాటే విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకుని సత్తా చాటారు. మల్కాజిగిరి కమిషనరేట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రీడాకారుల నుండి తీవ్ర పోటీని ఎదుర్కొని, తన అసాధారణ నైపుణ్యంతో అరుణ్ కుమార్ అగ్రస్థానంలో నిలిచారు. ఈ విజయంపై ఎస్సై జి. శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేస్తూ, విధి నిర్వహణలో ఉంటూనే క్రీడల్లో రాణించడం అభినందనీయమని కొనియాడారు. అరుణ్ కుమార్ సాధించిన ఈ ఘనత కోటగిరి పోలీస్ స్టేషన్‌తో పాటు నిజామాబాద్ కమిషనరేట్‌కు ఎంతో కీర్తిని తెచ్చిపెట్టిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది అరుణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

# పూజనీయ ధనశ్రీ తళవల్కర్ (దీదీ) 70వ జన్మదిన వేడుకలు

### కల్లూరులో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం....

**పోతంగల్, జూన్ 13 :-**

పోతంగల్ మండలంలోని కల్లూరు గ్రామంలో ఆదివారం రోజున స్వాధ్యాయ పరివార్ ఆధ్వర్యంలో పూజనీయ ధనశ్రీ తళవల్కర్ (దీదీ) 70వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. దీదీ 70వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా గ్రామవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సభ్యులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాధ్యాయ పరివార్ సభ్యులు మాట్లాడుతూ, పూజనీయ దీదీ గారి జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా, ప్రకృతిని ఆరాధించే విధంగా 'వృక్షో రక్షతి రక్షితః' అనే స్ఫూర్తితో మొక్కలు నాటడం ద్వారా జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. దీదీ గారి జీవితం నిరంతరం సమాజ హితం కోసం, భక్తి మార్గం కోసం అంకితమైందని, వారి స్ఫూర్తితోనే తాము ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వాధ్యాయ పరివార్‌కు చెందిన మహిళలు, పురుషులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, నాటిన మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తామే తీసుకుంటామని సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో



స్థానిక సర్పంచ్ రాంరెడ్డి, పంచాయతీ సెక్రటరీ రాజు, పట్వారి సాయిలు, అక్కమ్మ కృష్ణ, మేత్రి కిరణ్, కందార్ సాయిలు, భక్తులు, స్వాధ్యాయ పరివార్ ప్రతినిధులు పాల్గొని దీదీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# మంత్రి సత్యకుమార్ కృషితో రాష్ట్రానికి మరో 175 ఎంబీబీఎస్ సీట్లు

**పిడుగురాళ్ల మెడికల్ కాలేజీకి తొలి అనుమతి**
**విజయవాడ సిద్ధార్థకు అదనంగా 75 సీట్లు**

**అమరావతి, జూలై 13 :**

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య విద్య విస్తరణకు మరో ముందడుగు పడింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కృషితో జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలకు 100 ఎంబీబీఎస్ సీట్లతో తొలి అనుమతి మంజూరు చేయగా, విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలకు అదనంగా 75 సీట్లు కేటాయించింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ విద్యా సంవత్సరంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాలకు 75, పిడుగురాళ్లకు 100, విజయవాడ సిద్ధార్థకు 75, నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు 25 సీట్లు మంజూరయ్యాయి. దీంతో 2026–27 విద్యా సంవత్సరంలో మొత్తం 275 ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక వసతులు, అధ్యాపకుల నియామకాలు, వైద్య పరికరాల ఏర్పాటు, బోధనా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని మంత్రి తెలిపారు.



# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**నారాయణపేట, జులై,13**

ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 32 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను డి.ఆర్.ఓ రాజేశ్వరి కి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని డి . ఆర్.ఓ.అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫణి రాజ్, డిప్యూటీ కలెక్టర్,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణకు విద్యార్థినులకు టాబ్లెట్ల పంపిణీ

- **ఆరోగ్యమే మహాభాగ్యం: క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్**

**ఆలేరు, జూలై 13 :**

ఆలేరు పట్టణంలోని ఆర్ పి ఆర్ పి గర్ల్స్ రెసిడెన్షియల్ హాస్టల్లో విద్యార్థినులకు నులిపురుగుల కారణంగా వ్యాధులు వ్యాపించకుండా నివారించే లక్ష్యంతో సోమవారం టాబ్లెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు టాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవ ర్చుకోవాలని సూచించారు. పరిశు భ్రమైన పరిసరాల్లో నివసిస్తూ, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ, తల్లిదం డ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తమ కుటుంబానికి, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాతీయ నులిపురుగుల




నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు టాబ్లెట్ల వినియోగంపై వైద్య సిబ్బంది సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జూకర్ సంపత్, మరియమ్మ మార్కు, హాస్టల్ ప్రిన్సిపల్, డాక్టర్ హైమావతి, ప్రభుత్వ నర్సింగ్ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



# కవిత్వంతో ఉద్యమ చైతన్యాన్ని నింపిన గరిమెళ్ల!

### నేడు ప్రజాకవి గరిమెళ్ల సత్యనారాయణ జయంతి

### పరాయి పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన 'మాకొద్దీ తెల్లదొరతనం' విప్లవ గీతం

పరాయి పీడనకు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడి స్వేచ్ఛ, విముక్తి కోసం కలం పట్టి, గళమెత్తిన వీరసైనికుడు, స్ఫూర్తి ప్రదాత గరిమెళ్ళ సత్యనారాయణ. తన పదునైన కవిత్వంతో ఎందరినో స్వాతంత్ర్య పోరాటం వైపు నడిపించిన మార్గదర్శి ఆయన. స్వాతంత్ర్యోద్యమంలో "వందే మాతరం" నినాదం దేశవ్యాప్తంగా ఎంతటి ఉత్ప్రేరకంగా పనిచేసిందో... తెలుగునాట ఆయన రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనం" పాట ప్రతి తెలుగువారి నోటా అంతలా మార్మోగింది. తెలుగు జాతీయ కవిత్వానికి ఒరవడి పెట్టిన గరిమెళ్ళ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

#### గాంధీజీని సైతం ఆకర్షించిన కలం బలం

స్వాతంత్ర్యోద్యమ కవుల్లో గరిమెళ్ళ సత్యనారాయణది అగ్రస్థానం. దేశభక్తి కవితలు వ్రాసి జైలుశిక్ష అనుభవించిన వారిలో ఆయన ప్రథముడు. సబర్మతీ ఆశ్రమంలో ఉన్నప్పుడు గాంధీజీ ఈ పాట ప్రాముఖ్యతను తెలుసుకుని, దీనిని ఆంగ్లంలోకి అనువదించమని కోరారు. దాంతో టంగుటూరి ప్రకాశం పంతులు ఈ గేయాన్ని ఇంగ్లీష్‌లోకి అనువదించి తన "స్వరాజ్యం" పత్రికలో ప్రచురించారు. 29 ఏళ్ల చిన్న వయసులోనే జాతీయ వీరరసంతో నిండిన గేయాలు, పదునైన వ్యాసాలు రాసి బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజా హృదయాల్లోకి శరవేగంగా చొచ్చుకుపోయారు గరిమెళ్ళ.

#### కలెక్టరును కదిలించిన కంచు కంఠం

గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న సూరమ్మ, వేంకట నరసింహం దంపతులకు జన్మించారు. విజయనగరం, మచిలీపట్నం, రాజమహేంద్రవరంలో ఉన్నత చదువులు చదివి బి.ఏ పూర్తి చేశారు. గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తాగా, విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1920లో కాంగ్రెస్ సహాయ నిరాకరణ తీర్మానంతో ఉత్తేజితులై రాసిన "మా కొద్దీ తెల్లదొరతనం" పాట అప్పట్లో రాజమండ్రి వీధుల్లో నకలు కాపీ ఒకటి బేడా (12 పైసలు) చొప్పున అమ్ముడుపోయేది. ఈ పాట మార్మోగుతున్న తరుణంలో నాటి బ్రిటీషు కలెక్టరు బ్రేకన్ గరిమెళ్ళను పిలిపించి పాటను పూర్తిగా పాడమన్నాడు. గరిమెళ్ళ తన కంచు కంఠంతో ఖంగున పాడి వినిపించగా, తెలుగు రాని ఆ కలెక్టర్ కూడా ఈ పాటలోని మహత్తర శక్తికి, ప్రజా చైతన్యానికి అబ్బురపడి ఆయనకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించాడు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా మళ్లీ ప్రజల్లో గొంతెత్తడంతో కాకినాడ మేజిస్ట్రేట్ ఆయనకు మరో రెండేళ్ల కఠిన శిక్ష విధించారు. 1923లో జైలులో ఉండగా ఆయన తండ్రి మరణించినా... క్షమాపణ చెబితే విడుదల చేస్తామన్నా బ్రిటీషర్లకు తలవంచని ధీరుడు గరిమెళ్ళ.

#### బహుభాషా కోవిదుడు.. పత్రికా సంపాదకుడు

గరిమెళ్ళ కేవలం కవి మాత్రమే కాదు, జైలులో ఉన్న కాలంలో తమిళ, కన్నడ భాషలు నేర్చుకుని అక్కడి గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. భోగరాజు పట్టాభిసీతారామయ్య ఆంగ్లంలో వ్రాసిన 'ది ఎకనామిక్ కాంక్వెస్ట్ ఆఫ్ ఇండియా' గ్రంథాన్ని తెలుగులోకి తెచ్చారు. 'స్వరాజ్య గీతములు' (1921), హరిజనుల పాటలు (1923), ఖండకావ్యములు ఆయన కలం నుంచి జాలువారినవే. జీవనోపాధి కోసం మద్రాసు చేరుకుని గృహలక్ష్మి, ఆచార్య రంగా గారి 'వాహిని', ఆంధ్రప్రభ, ఆనందవాణి పత్రికల్లో సంపాదకుడిగా, సహాయ సంపాదకుడిగా సేవలు అందించారు.

#### చివరి దశలో దుర్భర దారిద్ర్యం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాలకుల నుంచి గరిమెళ్ళకు ఎలాంటి ఆదరణ దక్కలేదు. నాడు కొందరు మిత్రులు 'మాకొద్దీ నల్ల దొరతనం' అని రాయమని కోరినా, దేశభక్తుడైన ఆయన నిరాకరించారు. ఆస్తిపాస్తులు అమ్ముకుని అప్పులు తీర్చిన గరిమెళ్ళ తీవ్ర పేదరికంలో మగ్గారు. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రులు కొంత ఆర్థిక సాయం చేసినా ఆయన అవసరాలకు సరిపోలేదు. చివరి దశలో ఒక కన్ను పోయి, పక్షవాతం వచ్చి దిక్కులేని స్థితిలో యాచిస్తూ... 1952 డిసెంబర్ 18న కన్నుమూశారు. పాలకుల తీరుపై నిరంతరం పోరు సాగించిన ఆ మహాకవి భౌతికంగా దూరమైనా, తెలుగువారి గుండెల్లో ఆయన అక్షరాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన అవసరం!

**విపత్తుల వల్ల దేశానికి ఏటా 10 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం**

### తీరప్రాంత నిబంధనల ఉల్లంఘన, పర్యావరణ విధ్వంసమే విపత్తులకు మూలకారణం



ప్రపంచవ్యాప్తంగా అనేకానేక దేశాలపై ప్రకృతి విపత్తులు విరుచుకుపడుతున్నాయి. ఇవి సృష్టిస్తున్న అపార విధ్వంసంతో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు పూర్తిగా చిన్నాభిన్నం అవుతున్నాయి. సహజ, సాంస్కృతిక వనరులను ధ్వంసం చేసి, సాధారణ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసే ఆకస్మిక సంఘటనలనే మనం 'విపత్తులు' అంటున్నాం. విపత్తును ఇంగ్లీషులో "డిజాస్టర్" అంటారు. గ్రీకు, లాటిన్ భాషల్లో దీనికి 'దుష్టనక్షత్రం' అని అర్థం. భూకంపాలు, వరదలు, తుపానులు, వడగాల్పులు, మహమ్మారులు వంటి ప్రకృతి కారకాలతో పాటు ప్రపంచ యుద్ధాలు, ఉగ్రవాదం, అణు దాడులు వంటి మానవ కారక చర్యలు కూడా విపత్తుల కిందికే వస్తాయి.

#### భారత్‌కు భారీ నష్టం.. వరదలే ప్రధాన శత్రువు

ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం.. భారతదేశంలో సంభవించే విపత్తుల వల్ల జాతీయ ఆదాయంలో ఏటా 2.25 శాతం నష్టం వాటిల్లుతోంది. 'ప్రివెన్షన్ వెబ్ స్టాటిస్టిక్స్' నివేదిక ప్రకారం భారత్‌లో గత మూడున్నర దశాబ్దాలుగా దాదాపు 431 రకాల విపత్తులు సంభవించాయి. వీటి వల్ల సుమారు 1,43,000 మంది ప్రాణాలు కోల్పోగా, 15 కోట్ల మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమయ్యారు. మన దేశంలో అత్యధికంగా సంభవిస్తున్న విపత్తు 'వరదలు' అని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక స్పష్టం చేసింది. గత 20 ఏళ్లలో విపత్తుల కారణంగా దేశం 7,950 కోట్ల డాలర్లు (సుమారు రూ.5.91 లక్షల కోట్లు) నష్టపోయింది. దేశంలోని 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలలో దాదాపు 22 ప్రాంతాలు నిరంతరం ఏదో ఒక విపత్తుకు గురవుతూనే ఉన్నాయని 'ఇండియా డిజాస్టర్ నాలెడ్జ్ నెట్‌వర్క్' పేర్కొంది.

#### తీరప్రాంతాలపై పెరుగుతున్న ముప్పు

దేశంలో దాదాపు 7,500 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న సముద్ర తీరప్రాంతం విశిష్టమైన జీవవైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. గుజరాత్ (1,214 కి.మీ.), ఆంధ్రప్రదేశ్ (974 కి.మీ.) రాష్ట్రాలు అత్యధిక తీరప్రాంతాన్ని కలిగి ఉన్నాయి. తీరానికి 50 కిలోమీటర్ల పరిధిలోనే సుమారు 30 కోట్ల జనాభా నివసిస్తోంది. అయితే, పర్యావరణ సమతుల్యత లోపించడం, పెరుగుతున్న జనాభా, అడ్డగోలు నగరీకరణ, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఫ్యాక్టరీలు, ఓడరేవుల విస్తరణ తీర ప్రాంత జీవవైవిధ్యానికి తీవ్ర చేటు తెస్తున్నాయి. తుపానులు, వరదలు సంభవించినప్పుడు బీమా రంగం, ప్రభుత్వ సహాయాలు కొంతవరకు నష్టాన్ని పూడుస్తున్నప్పటికీ, శాశ్వత నివారణ చర్యలు కరువయ్యాయి.

#### కాగితాలకే పరిమితమైన చట్టాలు

పర్యావరణ పరిరక్షణ చట్టం (1986)కు అనుబంధంగా తీరప్రాంత నియంత్రణ నిబంధనల పేరిట 'కోస్టల్ రెగ్యులేషన్ జోన్' (జ=) నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం 1991లో తీసుకొచ్చింది. తీరాన్ని మూడు విభాగాలుగా విభజించి ఆంక్షలు విధించినప్పటికీ, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల స్వార్థం కోసం ఈ నిబంధనలను ఇప్పటివరకు 12 సార్లు సవరించారు. అభివృద్ధి పనుల పేరిట మడ అడవులు, హరితవనాలను విచ్చలవిడిగా ధ్వంసం చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు నిధులు, కేంద్ర నిధులతో రూపొందించిన విపత్తుల యాజమాన్య ప్రణాళికల అమలు కేవలం మొక్కుబడిగా మారింది. దశాబ్దాల క్రితం నిర్మించిన బహుళ ప్రయోజక తుపాను షెల్టర్లు నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి.

#### కార్యాచరణ అవసరం

ప్రకృతి వైపరీత్యాల నివారణకై ప్రభుత్వాలు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నష్టాల అంచనాలో స్వచ్ఛంద సంస్థలను, పౌర సమాజాన్ని భాగస్వాములను చేయాలి. తీరప్రాంతాల్లో గొలుసుకట్టు హరిత వనాల పెంపకానికి, మడ అడవుల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. క్షేత్రస్థాయి నుంచి ప్రభుత్వ వ్యవస్థలు త్వరితగతిన స్పందించి, బాధితులకు తగిన సహాయం అందించినప్పుడే భవిష్యత్తులో విపత్తులను ధీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ప్రజల్లో కలుగుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వీడియో గేమ్స్ ప్రగతి ప్రయాణమా వ్యసన ప్రమాదమా?

వర్చువల్ ప్రపంచం... వలసపోతున్న బాల్యం!

వినోదం, ఉపాధినిస్తున్న గేమింగ్ రంగం..

మితిమీరితే 'గేమింగ్ డిజార్డర్' ముప్పు



డిజిటల్ సాంకేతిక విప్లవం మానవ జీవన విధానాన్ని సమూలంగా మార్చివేసింది. ఈ మార్పులలో అత్యంత వేగంగా, ప్రభావవంతంగా విస్తరించిన రంగం వీడియో గేమింగ్. ఒకప్పుడు కేవలం పసిపిల్లల కాలక్షేపానికి పరిమితమైన వీడియో గేమ్‌లు.. నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది దైనందిన జీవితంలో విడదీయరాని భాగమయ్యాయి. చిన్నారుల నుండి యువత వరకు, విద్యార్థుల నుండి ఐటీ ఉద్యోగుల వరకు ప్రతి ఒక్కరూ ఈ మాయా ప్రపంచంలో ఓలలాడుతున్నారు. అయితే, నాణేనికి రెండు ముఖాలు ఉన్నట్లుగానే, ఈ సాంకేతిక ప్రగతితో పాటు తీవ్రమైన శారీరక, మానసిక, సామాజిక సమస్యలపై కూడా సమాజంలో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఆధునిక గేమింగ్ సామ్రాజ్యపు మూలాలు దాదాపు ఏడు దశాబ్దాల క్రితం నాటివి. 1958లో అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త విలియం హిగిన్బోథమ్ రూపొందించిన "టెన్నిస్ ఫర్ టూ" తొలి వీడియో గేమ్‌గా చరిత్రకెక్కింది. నేడు కృత్రిమ మేధస్సు (ఏఐ), వర్చువల్ రియాలిటీ (ఎ=) వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలు తోడవ్వడంతో, ఇవి నిజ జీవిత అనుభూతిని కలిగించే స్థాయికి రూపాంతరం చెందాయి. ప్రస్తుతం గ్లోబల్ గేమింగ్ పరిశ్రమ విలువ సుమారు 220 బిలియన్ అమెరికన్ డాలర్లకు పైగా ఉంది. చలనచిత్ర పరిశ్రమల సంయుక్త ఆదాయాన్ని సైతం అధిగమించి ఇది విస్తరిస్తోంది. చౌకైన స్మార్ట్‌ఫోన్‌లు, హై-స్పీడ్ ఇంటర్నెట్, యూపీఐ విప్లవం కారణంగా భారత్‌లో మొబైల్ గేమింగ్ వినియోగం ఊహించని స్థాయికి చేరుకుంది. ఇది గేమ్ డెవలప్‌మెంట్, యానిమేషన్, గ్రాఫిక్ డిజైనింగ్, ఈ-స్పోర్ట్స్ వంటి రంగాల్లో యువతకు అపారమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. పరిమిత సమయంలో, విజ్ఞానదాయకమైన గేమ్‌లను ఆడినప్పుడు పిల్లలలో సమస్యల పరిష్కార సామర్థ్యం, వ్యూహాత్మక ఆలోచన, ఏకాగ్రత మెరుగుపడతాయని శాస్త్రీయంగా నిరూపితమైంది. చేతికి-కంటికి మధ్య సమన్వయం, జ్ఞాపకశక్తి పదునుదేరుతాయి. ఈ ఫలితాల వల్లే అంతర్జాతీయ విద్యాసంస్థలు 'గేమిఫికేషన్' (ఆటల రూపంలో బోధన) పద్ధతిని వాడుతున్నాయి. అటు వైద్య క్షేత్రంలోనూ సంక్లిష్ట శస్త్రచికిత్సలకు ముందు సర్జన్లకు డిజిటల్ సిమ్యులేషన్ గేమ్‌ల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. పక్షవాతం, అల్జీమర్స్ రోగుల చికిత్సలో, రక్షణ రంగంలో సైనికుల వ్యూహరచనకు, పైలట్ల ట్రైనింగ్‌కు సైతం గేమింగ్ సాంకేతికతే ప్రధాన ఆధారంగా నిలుస్తోంది. అయితే, గంటల తరబడి స్క్రీన్లకు అతుక్కుపోవడం వల్ల పిల్లల్లో శారీరక శ్రమ శూన్యమై స్థూలకాయం, వెన్నునొప్పి, 'టెక్స్ట్ నెక్ సిండ్రోమ్', కంటిచూపు మందగించడం, నిద్రలేమి వంటి రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. మైదానాల్లో ఆడే ఆటలు మృగ్యమవడంతో భవిష్యత్తులో మధుమేహం, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మితిమీరిన గేమింగ్ వల్ల పిల్లల్లో కోపం, ఆందోళన, సమాజం నుండి ఒంటరిగా విడిపోవాలనే వైరాగ్యం పెరుగుతున్నాయి. ఈ తీవ్రతను గుర్తించే ప్రపంచ ఆరోగ్య సంస్థ "గేమింగ్ డిజార్డర్"ను ఒక అధికారిక మానసిక రుగ్మతగా ప్రకటించింది. ముఖ్యంగా హింసాత్మక గేమ్‌లను నిరంతరం ఆడే పిల్లల ఉపచేతన మనస్సులో క్రూరత్వం, దూకుడు స్వభావం నాటుకుపోతున్నాయి. ఆన్‌లైన్ మల్టీప్లేయర్ గేమింగ్ యుగంలో సరికొత్త సైబర్ సవాళ్లు ఎదురవుతున్నాయి. అపరిచితులతో పరిచయాలు పెంచుకుని వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వల్ల సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ బ్లాక్‌మెయిలింగ్ పెరుగుతున్నాయి. కొన్ని గేమ్‌లలో వర్చువల్ ఆయుధాలు, దుస్తులు కొనుగోలు చేయడానికి పిల్లలు తల్లిదండ్రులకు తెలియకుండా వారి బ్యాంకు ఖాతాల నుండి లక్షలాది రూపాయలు కరిగిస్తున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గేమ్స్ ద్వారా ఈ-స్పోర్ట్స్ ఒలింపిక్స్ స్థాయి గుర్తింపు పొందుతూ, స్ట్రీమింగ్ ద్వారా లక్షల ఆదాయం తెచ్చిపెడుతున్నప్పటికీ.. కఠినమైన క్రమశిక్షణ లేకుంటే జీవితాలు నాశనమవుతాయి. ఈ డిజిటల్ సంక్షోభం నుండి రేపటి తరాన్ని కాపాడుకోవడానికి ఉమ్మడి వ్యూహం అవసరం. ఇళ్లల్లో పిల్లల స్క్రీన్ టైమ్‌ను రోజుకు గరిష్టంగా ఒక గంటకు మించకుండా నియంత్రించాలి. మైదానాల్లో ఆడే ఆటలు, పుస్తక పఠనం, యోగా వైపు వారిని మళ్లించాలి. అన్నింటికంటే ముఖ్యంగా, తల్లిదండ్రులు పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపాలి. విచక్షణతో కూడిన బాధ్యతాయుతమైన వినియోగమే వీడియో గేమింగ్ రంగాన్ని సమాజ ప్రగతికి ఉపయోగపడే ఒక శక్తివంతమైన సాధనంగా మార్చగలదు. సాంకేతికతకు బానిసలుగా మారిపోకుండా, దానిని తమ ఎదుగుదలకు వాడుకునేలా పిల్లలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# తగ్గిన బంగారం

**హైదరాబాద్, జూలై 13 :** బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి శుభవార్త. సోమవారం దేశవ్యాప్తంగా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. గత ట్రేడింగ్ సెషన్‌తో పోలిస్తే పసిడి ధరలు గణనీయంగా తగ్గడంతో కొనుగోలుదారులకు ఊరట లభించింది. తాజా ధరల ప్రకారం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,910గా నమోదైంది. గత ధరతో పోలిస్తే రూ.1,420 తగ్గింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,30,000కు చేరుకుంది. ఈ విభాగంలో కూడా రూ.1,300 మేర తగ్గుదల నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర హైదరాబాద్, విజయవాడతో పాటు విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లో రూ.1,07,180గా కొనసాగుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప వ్యత్యాసం కనిపించింది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,000గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,32,000గా నమోదైంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రూ.1,43,060, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,150గా ఉంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళ ప్రాంతాల్లో హైదరాబాద్‌తో సమానంగా ధరలు నమోదయ్యాయి. అహ్మదాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,42,960, 22 క్యారెట్ల బంగారం రూ.1,30,050గా ఉంది.అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ మారకం విలువ, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, భౌగోళిక పరిణామాల ప్రభావంతో బంగారం ధరల్లో రోజువారీ మార్పులు చోటు చేసుకుంటాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కొనుగోలు చేసేముందు స్థానిక నగల దుకాణాల్లో తాజా ధరలను ఒకసారి పరిశీలించడం మంచిదని సూచిస్తున్నారు.




# ఈ వారం 4 రోజులు బ్యాంకులకు సెలవులు

**ముంబై, జూలై 13 :** బ్యాంకు శాఖల్లో చేయాల్సిన పనులు ఉన్న ఖాతాదారులు ఈ వారం సెలవుల వివరాలను ముందుగానే తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. జూలై 13 నుంచి 19 వరకు వివిధ జాతీయ, ప్రాంతీయ, మతపరమైన పండుగలు, వారాంతపు సెలవుల కారణంగా నాలుగు రోజుల పాటు పలు ప్రాంతాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి. భారతీయ రిజర్వు బ్యాంకు ప్రకటించిన వార్షిక సెలవుల జాబితా ప్రకారం జూలై నెలలో మొత్తం 12 రోజుల పాటు వివిధ రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. జూలై 16న రథయాత్ర, కాంగ్ పండుగ, హరేలా ఉత్సవాల సందర్భంగా భువనేశ్వర్, డెహ్రాడూన్, ఇంఫాల్ నగరాల్లో బ్యాంకులు పనిచేయవు. జూలై 17న యు. తిరోత్ సింగ్ వర్ధంతి సందర్భంగా షిల్లాంగ్‌లో బ్యాంకులకు సెలవు ఉంటుంది. జూలై 18న ద్రుక్పా త్షే-జి పండుగ సందర్భంగా గ్యాంగ్‌టక్‌లో బ్యాంకులు మూసివేస్తారు. జూలై 19న ఆదివారం కావడంతో దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులు సెలవు పాటించనున్నాయి. భారతీయ రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం ప్రతి నెల రెండో, నాలుగో శనివారాలతో పాటు ప్రతి ఆదివారం అన్ని షెడ్యూల్డ్, నాన్-షెడ్యూల్డ్ బ్యాంకులు తప్పనిసరిగా మూసివేయబడతాయి. ఈ రోజుల్లో శాఖల ద్వారా ప్రత్యక్ష సేవలు అందుబాటులో ఉండవు. జూలై నెలలో 5, 12, 19, 26 తేదీలలో ఆదివారం సెలవులు ఉండగా, 11న రెండో శనివారం, 25న నాలుగో శనివారం కారణంగా కూడా బ్యాంకులు మూసి ఉంటాయి. అయితే బ్యాంకు సెలవు రోజుల్లో కూడా ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు యథావిధిగా కొనసాగుతాయి. ఖాతాదారులు మొబైల్ బ్యాంకింగ్, అంతర్జాల బ్యాంకింగ్, యూపీఐ, నగదు బదిలీ వంటి సేవలను ఎలాంటి అంతరాయం లేకుండా వినియోగించుకోవచ్చు. చెక్కుల జమ, రుణ దరఖాస్తులు, నగదు లావాదేవీలు వంటి శాఖల ద్వారా జరిగే సేవలు మాత్రమే అందుబాటులో ఉండవు. అందువల్ల అత్యవసర బ్యాంకింగ్ పనులు ఉన్నవారు ముందుగానే ప్రణాళిక చేసుకుని పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



## పశ్చిమాసియా ఉద్రిక్తత..

# పెరిగిన ముడి చమురు ధరలు

**న్యూఢిల్లీ, జూలై 13 :** పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతుండటంతో ప్రపంచ ఇంధన మార్కెట్లు ఆందోళనకు గురవుతున్నాయి. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్న భయాలు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే బ్రెంట్ ముడి చమురు ఫ్యూచర్స్ ధర 3.24 శాతం పెరిగి బ్యారెల్‌కు 78.47 అమెరికా డాలర్లకు చేరుకుంది. అలాగే అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడి చమురు ధర కూడా 3.30 శాతం పెరిగి బ్యారెల్‌కు 73.77 అమెరికా డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గంలో జరిగే ముడి చమురు రవాణాలో దాదాపు ఐదో వంతు హర్మూజ్ జలసంధి ద్వారానే సాగుతుంది. ముడి చమురుతో పాటు ద్రవీకృత సహజ వాయువు ఎగుమతులకు కూడా ఈ జలమార్గం అత్యంత కీలకంగా భావిస్తారు. ఈ మార్గంలో రవాణాకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉందన్న ఆందోళనతో అంతర్జాతీయ చమురు మార్కెట్లు అప్రమత్తమయ్యాయి. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు కూడా తగ్గినట్లు అంతర్జాతీయ నివేదికలు సూచిస్తున్నాయి. గత కొన్ని వారాలతో పోలిస్తే ఆదివారం అత్యల్ప సంఖ్యలో మాత్రమే వాణిజ్య నౌకలు ఈ మార్గంలో ప్రయాణించినట్లు సమాచారం. దీంతో ప్రపంచ ఇంధన సరఫరాపై ఆందోళనలు మరింత పెరిగాయి. ఇదిలా ఉండగా, అమెరికా-ఇరాన్ మధ్య గత నెలలో ప్రారంభమైన శాంతి చర్చలు కూడా తాజా పరిణామాలతో ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. హర్మూజ్ జలసంధిలో రవాణాను సాధారణ స్థితికి తీసుకురావడం, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడం లక్ష్యంగా సాగిన ప్రయత్నాలకు తాజా పరిణామాలు గండికొట్టే అవకాశముందని చెబుతున్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ తాజా అంచనాల ప్రకారం ప్రపంచ చమురు సరఫరా కొంత పెరిగినప్పటికీ, సాధారణ అవసరాలతో పోలిస్తే ఇంకా గణనీయమైన కొరత కొనసాగుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగితే ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, దాని ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు ఇంధన ధరలపైనా పడే అవకాశముందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# వృద్ధుడి ఖాతాలో రూ.759 కోట్లు

## బ్యాంకు అధికారుల విస్తుపాటు




**ముజఫర్‌పూర్, జూలై 13 :** వృద్ధాప్య పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వెళ్లిన ఓ వృద్ధుడి బ్యాంకు ఖాతాలో ఏకంగా రూ.759 కోట్లు కనిపించడం కలకలం రేపింది. ఇదే సమయంలో ఆయన కుమారుడి ఖాతాలో కూడా అంతే మొత్తం కనిపించడంతో బ్యాంకు అధికారులు, స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ ఘటన బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో చోటుచేసుకుంది. 82 ఏళ్ల కామేశ్వర్ మిశ్రా తన వృద్ధాప్య పింఛన్ నగదు తీసుకునేందుకు సమీపంలోని సామాన్య సేవా కేంద్రానికి వెళ్లారు. ఆ రోజు బ్యాంకులకు సెలవు ఉండటంతో అక్కడే ఆధార్ ధ్రువీకరణ ద్వారా పింఛన్ మొత్తాన్ని ఉపసంహరించుకున్నారు. అనంతరం తన ఖాతాలో ఇంకా ఎంత మొత్తం ఉందో తెలుసుకోవాలని కేంద్రంలోని సిబ్బందిని కోరారు. సిబ్బంది ఖాతా వివరాలు పరిశీలించగా కామేశ్వర్ మిశ్రా ఖాతాలో ఏకంగా రూ.759 కోట్లు ఉన్నట్లు కనిపించింది. దీంతో వారు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం ఆయన దివ్యాంగుడైన కుమారుడి బ్యాంకు ఖాతాను కూడా పరిశీలించగా అందులోనూ రూ.759 కోట్లు జమ అయినట్లు గుర్తించారు. దీంతో ఇద్దరి ఖాతాల్లో కలిపి మొత్తం రూ.1,518 కోట్లు ఉన్నట్లు తేలింది. ఈ విషయాన్ని సామాన్య సేవా కేంద్రం సిబ్బంది వెంటనే సంబంధిత బ్యాంకు అధికారులకు, పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న అధికారులు ప్రాథమిక విచారణ ప్రారంభించి, భద్రతా చర్యల్లో భాగంగా కామేశ్వర్ మిశ్రా, ఆయన కుమారుడి బ్యాంకు ఖాతాలను తాత్కాలికంగా స్తంభింపజేశారు. ఈ భారీ మొత్తం పొరపాటున జమ అయిందా, సాంకేతిక లోపం కారణమా లేదా మరేదైనా కారణమా అనే కోణాల్లో అధికారులు విచారణ చేపట్టారు. పూర్తి విచారణ అనంతరం అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త

## నిధుల బదిలీ ఇక మరింత సులువు




**న్యూఢిల్లీ, జూలై 13 :** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తన ఖాతాదారులకు మరో శుభవార్త అందించింది. ప్రధాన డేటాబేస్ ఏకీకరణ, సాఫ్ట్‌వేర్ నవీకరణ పనుల కారణంగా గత రెండు వారాలుగా పరిమితంగా అందుబాటులో ఉన్న సేవలు ఇప్పుడు పూర్తిస్థాయిలో పునరుద్ధరించబడుతున్నాయి. ఈ సందర్భంగా పీఎఫ్ ఖాతా బదిలీ విధానాన్ని మరింత సులభతరం చేస్తూ సంస్థ కొత్త మార్పులను అమలు చేసింది. ఉద్యోగులు ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మారినప్పుడు పీఎఫ్ ఖాతాలోని నిధులను బదిలీ చేసుకునే ప్రక్రియను సులభతరం చేయడానికి ఇకపై రెండు మార్గాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో ఒకే విధానం ఉండగా, ఇప్పుడు మరో ప్రత్యామ్నాయాన్ని కూడా కల్పించింది. దీనివల్ల కాగితపు ప్రక్రియ తగ్గడంతో పాటు బదిలీ ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది. మొదటి విధానంలో ఉద్యోగులు పీఎఫ్ పోర్టల్‌లో తమ యూఏఎన్ సంఖ్య, సంకేత పదంతో ప్రవేశించి, మొబైల్‌కు వచ్చే ధ్రువీకరణ సంకేతాన్ని నమోదు చేయాలి. అనంతరం ఆన్‌లైన్ సేవల విభాగంలోకి వెళ్లి బదిలీ అభ్యర్థన ఎంపికను ఎంచుకోవాలి. అక్కడ గత సంస్థ సభ్యత్వ సంఖ్యను ఎంపిక చేసి వివరాలను పొందాలి. ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్‌కు వచ్చే ధ్రువీకరణ సంకేతాన్ని నమోదు చేసిన తర్వాత ప్రస్తుతం పనిచేస్తున్న సంస్థ వివరాలు కనిపిస్తాయి. వాటిని ఒకసారి పరిశీలించి అభ్యర్థనను సమర్పిస్తే బదిలీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. రెండో విధానంలో పీఎఫ్ పోర్టల్‌లోకి ప్రవేశించిన తర్వాత సభ్య సేవల చరిత్ర విభాగాన్ని ఎంచుకోవాలి. అక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న సంస్థతో పాటు గతంలో పనిచేసిన సంస్థల వివరాలు కనిపిస్తాయి. సంబంధిత ఎంపిక వద్ద ఉన్న అభ్యర్థన లింక్‌ను ఎంచుకుని ఫారం-13ను సమర్పించడం ద్వారా కూడా పీఎఫ్ నిధులను కొత్త సంస్థ ఖాతాకు బదిలీ చేసుకోవచ్చు. ఈ మార్పులతో ఉద్యోగులు ఉద్యోగం మారిన ప్రతిసారి పీఎఫ్ నిధుల బదిలీని మరింత వేగంగా, సులభంగా పూర్తి చేసుకునే అవకాశం కలుగుతుందని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తెలిపింది.

# ఐఫోన్ 17కు భారీ డిమాండ్

**న్యూఢిల్లీ, జూలై 13 :** భారత మార్కెట్‌లో యాపిల్ ఐఫోన్ 17 శ్రేణి స్మార్ట్‌ఫోన్లకు భారీ డిమాండ్ నెలకొంది. త్వరలో ధరలు పెరిగే అవకాశం ఉందనే అంచనాల నేపథ్యంలో వినియోగదారులు ముందుగానే కొనుగోళ్లకు మొగ్గు చూపుతుండటంతో పలు మోడళ్ల నిల్వలు వేగంగా ఖాళీ అవుతున్నాయి. గత కొన్ని రోజులుగా ఆన్‌లైన్ విక్రయ వేదికలతో పాటు ప్రత్యక్ష విక్రయ కేంద్రాల్లోనూ ఐఫోన్ 17 బేస్ మోడల్‌తో పాటు పలు రంగులు, నిల్వ సామర్థ్యాల రూపాంతరాలు అందుబాటులో లేకపోవడం గమనార్హం. మెమరీ చిప్‌ల తయారీ వ్యయం పెరగడం వల్ల కొన్ని ఉత్పత్తుల ధరలను సవరించాల్సి వస్తోందని యాపిల్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి టిమ్ కుక్ ఇటీవల సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో సంస్థ ఇప్పటికే కొన్ని ట్యాబ్లెట్‌లు, కంప్యూటర్ల ధరలను పెంచింది. ప్రస్తుతం ఐఫోన్ 17 ధరల్లో ఎలాంటి మార్పు లేకపోయినా, సమీప భవిష్యత్తులో ధరలు పెరిగే అవకాశం ఉందనే ప్రచారం మార్కెట్‌లో వినిపిస్తోంది. దీంతో వినియోగదారులు ముందుగానే కొనుగోళ్లు పూర్తి చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు ఆధారిత డేటా కేంద్రాల అవసరాలు పెరగడంతో మెమరీ, నిల్వ చిప్‌లకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. దీని ప్రభావంతో చిప్‌ల సరఫరాపై ఒత్తిడి ఏర్పడినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే సమయంలో శాంసంగ్, ఒప్పో, వివో, రియల్‌మీ వంటి పలు స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలు ఇప్పటికే తమ కొన్ని మోడళ్ల ధరలను పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఐఫోన్ 17 ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్న వినియోగదారులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ధరలకే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇదే సరైన సమయమని కొందరు విక్రయదారులు కూడా సూచిస్తున్నారు. అయితే ఐఫోన్ 17 ధరల పెంపుపై యాపిల్ సంస్థ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మార్కెట్‌లో వినిపిస్తున్న అంచనాలు, ఊహాగానాలే ప్రస్తుతం ఐఫోన్ 17కు ఏర్పడిన కొరతకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు.








## సీఎస్కే కొత్త కోచ్ రేసులో

# ధోనీ, అశ్విన్!

ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. తమ జట్టుతో 18 ఏళ్లుగా హెడ్ కోచ్‌గా కొనసాగుతున్న స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఫ్లెమింగ్ కోచింగ్‌లో సీఎస్కే ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ గెలుచుకుంది. ఎంఎస్ ధోనీతో అతనికి ఉన్న అవినాభావ సంబంధం జట్టు విజయాలకు మూలస్తంభంగా నిలిచింది. అయితే, గత మూడేళ్లుగా సీఎస్కే ప్లేఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీ యాజమాన్యం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆధునిక టీ20 ఫార్మాట్‌లో అవసరమైన కొత్త వ్యూహాలు, ఆలోచనలు ఫ్లెమింగ్ వద్ద కొరవడ్డాయని, అందుకే జట్టు ప్రక్షాళనలో భాగంగా ఈ మార్పు చేపట్టినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. ఫ్లెమింగ్ నిష్క్రమణతో అతని స్థానాన్ని భర్తీ చేసే కొత్త కోచ్ ఎవరనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. పలువురు దిగ్గజాలు, యువ కోచ్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. కొత్త కోచ్ రేసులో ధోనీ, ద్రవిడ్, అశ్విన్, దినేశ్ కార్తీక్, హేమంగ్ బదానీ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

## టీమిండియాతో తొలి మ్యాచ్‌కు

# ఇంగ్లండ్ జట్టు ప్రకటన



భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూడు వన్డేల సిరీస్‌కు రంగం సిద్ధమైంది. మంగళవారం బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగనున్న తొలి మ్యాచ్ కోసం ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. ఈ మ్యాచ్‌లో యువ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్‌ను ఓపెనర్‌గా బరిలోకి దించుతూ ఇంగ్లండ్ యాజమాన్యం ఆశ్చర్యకర నిర్ణయం తీసుకుంది. సీనియర్ బ్యాటర్ బెన్ డకెట్‌తో కలిసి అతను ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. ఈ మ్యాచ్ ఇంగ్లండ్ వికెట్ కీపర్-బ్యాటర్ జోస్ బట్లర్‌కు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకం కానుంది. అతను తన కెరీర్‌లో 200వ వన్డే ఆడబోతున్నాడు. ఇంగ్లండ్ వైట్-బాల్ క్రికెట్‌లో కీలక ఆటగాడిగా ఉన్న బట్లర్, 2012 ఫిబ్రవరి 21న దుబాయ్‌లో పాకిస్థాన్‌పై తన వన్డే అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు ఆడిన 199 మ్యాచ్‌లలో 39.11 సగటుతో 5,515 పరుగులు సాధించాడు. ఇందులో 11 సెంచరీలు, 29 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఈ మైలురాయి మ్యాచ్‌లో అతను ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే 21 వన్డేలు ఆడిన యువ డైనమిక్ ప్లేయర్ బెథెల్‌ను ఓపెనర్‌గా ప్రమోట్ చేయడం వెనుక బలమైన కారణమే ఉంది. బెన్ డకెట్‌కు సరైన భాగస్వామిని కనుగొనాలనే ఇంగ్లండ్ ప్రయత్నాలు దీని ద్వారా స్పష్టమవుతున్నాయి. ఇటీవలి కాలంలో ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జాక్ క్రాలీ, రెహాన్ అహ్మద్ తర్వాత డకెట్‌కు ఐదో ఓపెనింగ్ భాగస్వామిగా బెథెల్ నిలవనున్నాడు. ఇది ఓపెనింగ్ స్థానంపై ఇంగ్లండ్ జట్టులో నెలకొన్న అస్థిరతను సూచిస్తోంది. మరోవైపు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ వంటి బలమైన భారత బ్యాటింగ్‌ను కట్టడి చేసేందుకు కెప్టెన్ హ్యారీ బ్రూక్ నేతృత్వంలోని ఇంగ్లండ్ జట్టు పకడ్బందీ వ్యూహంతో బరిలోకి దిగుతోంది. విల్ జాక్స్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్ రూపంలో ముగ్గురు స్పిన్నర్లతో దాడి చేయాలని నిర్ణయించుకుంది. పేస్ బాధ్యతలను జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ మోయనున్నారు. ఇటీవల టీ20 సిరీస్‌లో అదరగొట్టిన ఆర్చర్, గతేడాది నవంబర్ తర్వాత తొలిసారిగా వన్డే జట్టులోకి తిరిగి వచ్చాడు. దీంతో గస్ అట్కిన్సన్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే జరగనుంది. ఇరు జట్లు జూలై 16న కార్డిఫ్‌లో రెండో వన్డే, జూలై 19న లార్డ్స్‌లో మూడో వన్డేలో తలపడనున్నాయి.

**తొలి వన్డేకు ఇంగ్లండ్ తుది జట్టు:**

జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), శామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, జోష్ టంగ్, ఆదిల్ రషీద్.




# భారత మహిళదే లార్డ్స్



## లెస్బియన్ క్రికెట్ దంపతుల గోల!

ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టులో సీనియరైన అష్లే గార్డ్‌నర్ వివాదంలో ఇరుక్కుంది. మరో మహిళను పెళ్లి చేసుకున్న ఈ ఆల్‌రౌండర్ ఇప్పుడు మరొకరితో ప్రేమాయాణం సాగిస్తుందనే



వార్త వైరలవుతోంది. గార్డ్‌నర్‌పై ఈ ఆరోపణలు చేసింది ఆమె భార్య మోనికా రైట్ కావడం గమనార్హం. మోనికా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్న ఈ అఫైర్ విషయం డెయిలీ మెయిల్ వార్థ సంస్థలో ప్రచురితమైంది. గార్డ్‌నర్ అఫైర్‌పై భగ్గుమన్న మోనికా.. ఆస్ట్రేలియా క్రికెటర్ జార్జియా వోల్ ఫొటోను షేర్ చేస్తూ.. ‘ఈవిడే మా కాపురాన్ని నాశనం చేసింది’ అని వెల్లడించింది. అన్యోన్యంగా ఉండే తమ మధ్య దూరం పెరగడానికి కారణం భారత పర్యటనే అంటోంది మోనికా. భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్ కోసం గార్డనర్‌తో పాటు ఆమె భార్య మోనికా కూడా వచ్చింది. అయితే.. టోర్నీ సమయంలోనే గార్డ్‌నర్ ప్రవర్తనలో తేడాను గమనించింది మోనిక. స్వదేశం వచ్చాక ఇదే విషయంపై తన భాగస్వామిని ఆమె ప్రశ్నించింది. అప్పుడు.. గార్డ్‌నర్ మన మధ్యలో ఏదో మార్పు వచ్చింది. ఇక కలిసి ఉండడం కుదరదు అని తేల్చి చెప్పింది. అక్కడితో వీరి పెళ్లి పెటాకులైంది. నిరుడు నవంబర్‌లోనే ఆసీస్ ఆల్‌రౌండర్ సిడ్నీలో తాము కలిసి ఉంటున్న ఇంటిని వీడింది. వెళ్తూ వెళ్తే తమ పెళ్లి ఉంగరాలను అక్కడే వదిలేసిందని డెయిలీ మెయిల్ కథనం పేర్కొంది. ఐదేళ్లు ప్రేమలో మునిగితేలిన గార్డ్‌నర్, మోనికలు 2025 ఏప్రిల్‌లో పెళ్లి చేసుకున్నారు. ఏడాది పూర్తికాగానే వీరి మధ్య మనస్పర్థలు.. పరాయి ఆకర్షణలు పెరగడంతో వీరి బంధం ముగిసింది.

## భారత అమ్మాయిల చరిత్రాత్మక విజయం

లార్డ్స్ టెస్టులో భారత అమ్మాయిలు అద్భుతం చేశారు. నాలుగో రోజు తొలి సెషన్‌లోనే ఇంగ్లండ్ మిడిలార్డర్‌ను పడగొట్టి చరిత్రాత్మక విజయంతో సంబురాలు చేసుకున్నారు. టీ20 ప్రపంచకప్ వైఫల్యాన్ని మరిపించేలా.. 270 పరుగుల తేడాతో గెలుపొంది యావత్ భారతావనిని పులకింపజేశారు.

**తొలి ఇన్నింగ్స్‌లోనే ఇంగ్లండ్ పాలిట విలన్‌లా మారిన పేసర్ క్రాంతి గౌడ్ నిప్పులు చెరగడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. యస్తికా భాటియా(113) రికార్డు శతకం.. స్మృతి మంధాన(70)ల బ్యాటింగ్ మెరుపులతో కుదేలైన ఇంగ్లండ్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.**

ఇంగ్లండ్ గడ్డపై భారత పురుషుల జట్టుకు చెంపపెట్టులాంటి విజయం సాధించారు అమ్మాయిలు. పేలవమైన ఆటతో టీ20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన శ్రేయాస్ అయ్యర్ సేనకు.. ఇంగ్లండ్‌ను ఇలా ఓడించాలి అని చాటిచెప్పింది హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం. లార్డ్స్‌లో జరిగిన ఏకైక టెస్టులో యువ పేసర్ క్రాంతి గౌడ్(2-54) విజృంభణతో ఆతిథ్య జట్టు బ్యాటర్లు తోకుముడిచారు. బ్యాటుతో మెరిసిన స్మృతి మంధాన(70), యస్తికా భాటియా(113)లు చిరస్మరణీయ విజయంలో కీలకమయ్యారు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తేలిపోయిన ఆతిథ్య జట్టు పొట్టి వరల్డ్‌కప్ ఓడిన చోటే.. ఏకైక టెస్టులోనూ చతికిలపడింది. టీమిండియా రెండో ఇన్నింగ్స్‌ను 341-7 వద్ద డిక్లేర్ చేశాక.. బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 6 పరుగులకే ఓపెనర్లను కోల్పోయింది. 457 పరుగుల భారీ ఛేదనలో క్రాంతి గౌడ్(2-54).. సయాలీ సత్ఘరే(2-24)ల ధాటికి ఆతిథ్య జట్టు చేతులెత్తేసింది. ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న టమ్మీ బ్యూమంట్(0), హీథర్ నైట్(13)లను ఔట్ చేసిన క్రాంతి విజయానికి పునాది వేసింది. మూడో రోజు పోరాడిన అమీ జోన్స్.. నాలుగోరోజు తొలి సెషన్‌లోనే ఔటవ్వగా.. టీమిండియా విజయం మరింత సలువైంది. ఓవర్‌నైట్ స్కోర్ 130-6తో నాలుగో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ చూస్తుండగానే కుప్పకూలింది. తొలి సెషన్ మొదట్లోనే అమీ జోన్స్(54) వికెట్ తీసిన స్నేహ్ రాణా(4-42) ఆతిథ్య జట్టు ఓటమిని ఖాయం చేసింది. సోఫీ ఎకిల్‌స్టోన్(50)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 22 రన్స్ జోడించిన ఇసీ వాంగ్(1)ను దీప్తి శర్మ బౌల్డ్ చేసింది. తర్వాతి ఓవర్లోనే లారెన్ బెల్(0)ను దీప్తి బౌల్డ్ చేయగా.. క్రీజునంటుకున్న ఎకిల్‌స్టోన్‌ను రాణా ఔట్ చేసి తరాతరాలు చెప్పుకోదగగిన విజయంలో భాగమైంది. లార్డ్స్ టెస్టులో రెండో రోజు పట్టుబిగించిన భారత జట్టు పేసర్ క్రాంతి గౌడ్(5-37) సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను పడగొట్టింది. సొంతగడ్డపై దంచేయాలనుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లను వణికించిన క్రాంతి.. మొదటి సెషన్‌లోనే కోలుకోలేని దెబ్బకొట్టింది. ఓపెనర్ మియా బౌచిర్(23)ను పెవిలియన్ చేర్చిన స్పీడ్‌స్టర్.. బౌండరీలతో చెలరేగుతున్న అలిసే క్యాప్సే(9)ను స్వింగ్‌తో వెనక్కి పంపింది. మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే(2-40), స్నేహ్ రాణా(2-41) రెచ్చిపోగా లంచ్ లోపే సగం మంది పెవిలియన్ చేరారు. అర్ధ శతకం బాదిన అమీ జోన్స్ (52) వెనుదిరిగినా.. పట్టువదలకుండా క్రీజునంటుకున్న కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) పోరాడింది. కానీ, లంచ్ తర్వాత ఆమెను సైతం గౌడ్ వెనక్కి పంపింది. లారెన్ బెల్‌ను ఔట్ చేయడం ద్వారా టెస్టుల్లో మొదటిసారి ఐదు వికెట్లు తీసింది భారత స్పీడ్‌స్టర్. చివరి బ్యాటర్ లారెన్‌ను దీప్తి ఎల్బీ చేయడంతో 170 వద్ద ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాకు 115 పరుగుల ఆధిక్యం లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (83), హర్మన్‌ప్రీత్ కౌర్(58)లు అర్ధ శతకాలతో పటిష్టమైన పునాది వేసినా లాభం లేకపోయింది. ఇంగ్లండ్ స్పిన్నర్ మ్యాడీ విల్లియర్స్(2-79) ధాటికి మిడిలార్డర్ వైఫలమైంది. ఓవైపు వికట్లు పడుతున్నా బాధ్యతగా ఆడిన దీప్తి శర్మ(57) టెయిలెండర్లతో కలిసి పోరాడి స్కోర్ 280 దాటించింది. కానీ, ఒకే ఓవర్లో దీప్తిని, క్రాంతి గౌడ్‌ను ఔట్ చేసిన సోఫీ ఎకిల్‌స్టోన్(3-68) భారత ఇన్నింగ్స్‌కు తెరదించింది.

### అందమైన ముందడుగు: సచిన్

లార్డ్స్‌లో చారిత్రక విజయం సాధించిన టీమిండియా మహిళల క్రికెట్ జట్టుపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా జరిగిన మహిళల టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై హర్మన్‌ప్రీత్ కౌర్ సేన గెలవడం ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించాడు. మహిళల క్రికెట్ ప్రస్థానంలో ఇది మరో ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నాడు. ఈ మ్యాచ్ చివరి రోజున సచిన్ స్వయంగా మైదానంలో ఉండి విజయాన్ని వీక్షించాడు. ఆట ప్రారంభానికి ముందు సచిన్ భారత మహిళా క్రికెటర్లతో మాట్లాడాడు. ఇంగ్లండ్‌పై భారత్ 270 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన అనంతరం, సచిన్ సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నాడు. “ప్రతి క్రికెటర్‌కు లార్డ్స్‌లో ఆడాలనే కల ఉంటుంది. గత నాలుగు రోజులుగా, తొలిసారిగా ఇక్కడ మహిళల టెస్ట్ క్రికెట్ జరగడంతో కొత్త తరం క్రీడాకారిణులు ఆ కలను సాకారం చేసుకున్నారు” అని సచిన్ పేర్కొన్నాడు. ఈ అద్భుత విజయం సాధించిన భారత జట్టుకు అభినందనలు తెలిపిన సచిన్, కీలక క్రీడాకారిణుల ప్రదర్శనను ప్రత్యేకంగా ప్రస్తావించాడు. “వైస్ కెప్టెన్ స్మృతి మంధాన నిలకడ, యాస్తిక భాటియా అద్భుతమైన సెంచరీ, పేసర్ క్రాంతి గౌడ్ ఐదు వికెట్ల ప్రదర్శన ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి” అని కొనియాడాడు.

## జూన్ ‘ప్లేయర్ ఆఫ్ ది మంత్’ నామినేషన్లలో గిల్



జూన్ నెలకు గానూ ఐసీసీ పురుషుల ‘ప్లేయర్ ఆఫ్ ది మంత్’ అవార్డుకు భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నామినేట్ అయ్యాడు. జూన్ నెలలో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్‌తో పాటు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్, న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నాథన్ స్మిత్ కూడా ఈ అవార్డు కోసం పోటీలో ఉన్నట్లు ఐసీసీ సోమవారం ప్రకటించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన హోం సిరీస్‌లో గిల్ టెస్టు, వన్డే ఫార్మాట్లలో అద్భుతంగా రాణించాడు. న్యూ చండీగఢ్‌లో జరిగిన ఏకైక టెస్టులో 126 పరుగులు చేసి భారత ఇన్నింగ్స్ విజయానికి కీలకంగా నిలిచాడు. అనంతరం వన్డే సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనే 238 పరుగులు సాధించాడు. తొలి వన్డేలో 66 బంతుల్లో 84 పరుగులు చేసిన గిల్, లక్నో వన్డేలో కాళ్ల నొప్పితో ఇబ్బంది పడుతూనే 110 బంతుల్లో 154 పరుగులు చేసి భారత్‌కు విజయం అందించాడు. ఆ మ్యాచ్‌తో పాటు సిరీస్‌లోనూ అత్యుత్తమ ఆటగాడిగా నిలిచి, భారత్ 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్ ఆస్ట్రేలియాపై తన జట్టుకు చారిత్రక 2-1 వన్డే సిరీస్ విజయం అందించడంలో కీలక పాత్ర పోషించాడు.




## 'కొరియన్ కనకరాజు' టీజర్‌కు

# ప్రభాస్ శ్రీకారం

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న వైవిధ్యభరిత చిత్రం 'కొరియన్ కనకరాజు'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రంలోని 'కిమ్‌చి కారం' టీజర్‌ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించింది. సోమవారం సాయంత్రం 4.05 గంటలకు సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపింది. 'కొరియన్ కనకరాజు ప్రపంచాన్ని మీకు పరిచయం చేయడానికి రెబల్ స్టార్ ప్రభాస్ వస్తున్నారు' అంటూ చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ టీజర్ ద్వారా సినిమాలో వరుణ్ తేజ్ పాత్ర, ఆయన హావభావాలు, నటన శైలి ఎలా ఉండబోతుందో ప్రేక్షకులకు పరిచయం చేయనున్నట్లు సమాచారం. 'భారత--కొరియా వినోదం' అనే భావనతో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి గాంధీ మేర్లపాక దర్శకత్వం వహిస్తున్నారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యూవీ క్రియేషన్స్, టీ-సిరీస్ సౌత్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నిర్మాతలుగా రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి వ్యవహరిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మాణ భాగస్వామిగా ఉండటంతో ప్రభాస్ ఈ టీజర్‌ను విడుదల చేయడానికి ముందుకు వచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ యాక్షన్ వినోదాత్మక చిత్రాన్ని ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. టీజర్ విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.

## 'సూర్య సన్ ఆఫ్ కృష్ణన్'లో తొలి ఎంపిక దీపికా?

దక్షిణాది సినీ పరిశ్రమలో అందమైన ప్రేమకథలను తెరపై ఆవిష్కరించిన దర్శకుల్లో గౌతమ్ వాసుదేవ్ మీనన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఆయన తెరకెక్కించిన 'వారణం ఆయిరం' చిత్రం తెలుగులో 'సూర్య సన్ ఆఫ్ కృష్ణన్' పేరుతో విడుదలై ప్రేక్షకుల మన్ననలు పొందింది. వాణిజ్యపరంగా ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, కథ, భావోద్వేగాలు, సంగీతంతో ఈ చిత్రం ఇప్పటికీ సినీ అభిమానుల హృదయాల్లో ప్రత్యేక స్థానం దక్కించుకుంది. సూర్య ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రానికి హారిస్ జయరాజ్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇందులోని ప్రతి పాట ఇప్పటికీ సంగీత ప్రియులను అలరిస్తూ సామాజిక మాధ్యమాలు, సంగీత వేదికల్లో ఆదరణ పొందుతోంది. చిత్రంలో సూర్య సరసన సమీరా రెడ్డి కథానాయికగా నటించి తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. అయితే ఈ పాత్రకు తొలుత బాలీవుడ్ నటి దీపికా పదుకొణెను ఎంపిక చేయాలని దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ భావించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మోడల్‌గా ఉన్న సమయంలోనే దీపికాకు ఈ చిత్రంలో నటించే అవకాశం వచ్చినప్పటికీ, అప్పటికే షారుఖ్ ఖాన్ సరసన 'ఓం శాంతి ఓం' చిత్రంలో నటించే అవకాశం రావడంతో తేదీల సమస్య కారణంగా ఈ చిత్రాన్ని వదులుకున్నట్లు సమాచారం. దీంతో సమీరా రెడ్డిని కథానాయికగా ఎంపిక చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఈ చిత్రం ద్వారానే సమీరా రెడ్డి తమిళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. తొలి చిత్రంతోనే నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, అనంతరం తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారు. తెలుగులో జూనియర్ ఎన్టీఆర్, చిరంజీవి వంటి అగ్ర కథానాయకుల సరసన నటించి ప్రేక్షకులను అలరించిన సమీరా రెడ్డి, వివాహం అనంతరం సినిమాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ అభిమానులతో తన అనుభవాలను పంచుకుంటున్నారు.






## ఒడిదొడుకులు దాటి మళ్లీ వెలుగులోకి అమీషా పటేల్

బాలీవుడ్ ప్రముఖ నటి అమీషా పటేల్ సినీ ప్రయాణం విజయాలు, ఒడిదొడుకులతో సాగింది. 2000లో హృతిక్ రోషన్ సరసన నటించిన 'కహో నా ప్యార్ హై' చిత్రంతో వెండితెరకు పరిచయమైన ఆమె, తొలి సినిమాతోనే ఘన విజయాన్ని అందుకుని రాత్రికి రాత్రే స్టార్ కథానాయికగా గుర్తింపు పొందారు. రాకేష్ రోషన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత తెలుగు సినీ పరిశ్రమలో పవన్ కళ్యాణ్ సరసన 'బద్రి' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు. అనంతరం సన్నీ డియోల్‌తో కలిసి నటించిన 'గదర్: ఏక్ ప్రేమ్ కథ' చిత్రంలోని 'సకీనా' పాత్ర ఆమెకు దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపును తీసుకొచ్చింది. ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలో అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. తదుపరి 'హమ్‌రాజ్', 'భూల్ భులయ్యా' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించినప్పటికీ, ఆ తర్వాత ఆమె సినీ జీవితంలో కొన్ని ఒడిదొడుకులు ఎదురయ్యాయి. కొన్ని చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోకపోవడం, వ్యక్తిగత కారణాలతో కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత 2023లో విడుదలైన 'గదర్ 2'తో అమీషా పటేల్ ఘనంగా తిరిగి ప్రేక్షకుల ముందుకు వచ్చారు. సన్నీ డియోల్, అమీషా పటేల్ జంట మరోసారి ప్రేక్షకులను అలరించడంతో ఈ చిత్రం రూ.500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. 'సకీనా' పాత్రకు ఇప్పటికీ ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణను ఈ చిత్రం మరోసారి నిరూపించింది. ఈ విజయంతో 'గదర్ 3' నిర్మాణానికి కూడా సన్నాహాలు జరుగుతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. 'కహో నా ప్యార్ హై'తో ప్రారంభమైన అమీషా పటేల్ సినీ ప్రయాణం ఎన్నో సవాళ్లను అధిగమించి నేటికీ విజయవంతంగా కొనసాగుతోంది. 1975 జూన్ 9న ముంబైలో జన్మించిన ఆమె ప్రముఖ న్యాయవాది, రాజకీయ నాయకుడు రజనీ పటేల్ మనవరాలు. సినిమా నేపథ్యం లేకపోయినా తన ప్రతిభతో సినీ రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన 'నరసింహుడు' చిత్రంలో కథానాయికగా నటించిన అమీషా పటేల్, మహేష్ బాబు నటించిన 'నాని' చిత్రంలో ఒక ప్రత్యేక గీతంలో కూడా సందడి చేశారు. ప్రస్తుతం ఎంపిక చేసిన చిత్రాల్లో మాత్రమే నటిస్తూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

## ఒక్క రాత్రిలో తొమ్మిది సినిమాలు కోల్పోయా: విద్యా బాలన్

ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా గుర్తింపు పొందిన విద్యా బాలన్ తన సినీ జీవిత ప్రారంభంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నట్లు వెల్లడించారు. ఒక సినిమా ఆగిపోవడంతో తనపై "ఐరన్ లెగ్" అనే ముద్ర వేసి, ఒక్క రాత్రిలోనే తొమ్మిది చిత్రాల నుంచి తొలగించారని ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడిన విద్యా బాలన్, తన సినీ ప్రయాణం ప్రారంభ రోజులను గుర్తు చేసుకున్నారు. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ సరసన 'చక్రం' చిత్రంలో నటించే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు. అయితే చిత్రీకరణ ప్రారంభమైన కొద్ది రోజులకే అనివార్య కారణాలతో ఆ సినిమా నిలిచిపోయిందని చెప్పారు. ఆ సినిమా ఆగిపోవడానికి తానే కారణమని కొందరు ప్రచారం చేశారని, దీంతో తనపై "ఐరన్ లెగ్" అనే ముద్ర వేశారని విద్యా బాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రచారం కారణంగా ఒక్క రాత్రిలోనే తొమ్మిది సినిమాల నుంచి తనను తొలగించారని తెలిపారు. ఆ సమయంలో తాను తీవ్ర మానసిక వేదన అనుభవించినట్లు చెప్పారు. అయితే వాస్తవానికి సినిమా ఆగిపోవడానికి తనకు ఎలాంటి సంబంధం లేదని, దర్శకుడు, మోహన్‌లాల్ మధ్య ఏర్పడిన అభిప్రాయ భేదాల వల్లే ఆ ప్రాజెక్టు నిలిచిపోయిందని విద్యా బాలన్ స్పష్టం చేశారు. కానీ ఆ సంఘటన తన సినీ జీవితంపై తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొన్నారు. అనేక ఇబ్బందులు, విమర్శలను ఎదుర్కొన్నప్పటికీ తన ప్రతిభపై నమ్మకం కోల్పోలేదని, కష్టపడి అవకాశాలను అందిపుచ్చుకుని నటిగా తనను తాను నిరూపించుకున్నానని విద్యా బాలన్ తెలిపారు. అనంతరం వరుస విజయాలతో భారతీయ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా ఎదిగి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన చిత్రాల్లో మాత్రమే నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com